teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 379 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 23 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## ఈనెల 24న రాష్ట్రంలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరని స్పష్టం

పరీక్షకు వచ్చిన దరఖాస్తుల మొత్తం 92,808

అభ్యర్థులకు అనుగుణంగా 259 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

.. వివరాలు 2లో



# స్థానిక సమరం..

### డబ్బుల మూటలు సిద్ధం చేస్తున్న ఖద్దరు చొక్కాలు!

### ఎన్నికల్లో పోటీ ఆషామాషి కాదు..తడిసి మోపెడవుతున్న ఖర్చులు..

### సన్నద్ధమవుతున్న ఆశావహులు

**పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక ఎన్నికలకు కసరత్తు ప్రారంభించనుంది.మూడు,నాలుగు నెలల్లో గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది మున్సిపల్ తో పాటు సింగిల్ విండో ఎన్నికలు కూడా జరగనున్నాయి. మొదట గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసి పాలనను ప్రత్యేక అధికారులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీటీసీ, జడ్పీటిసిల పదవీకాలం కూడా ముగియనుంది. దీంతో ఆయా రాజకీయ పార్టీల నేతల దృష్టి స్థానిక ఎన్నికలపై పడుతోంది. గ్రామస్థాయి నేతలు సర్పంచ్ ఎంపీటీసీ పదవుల కోసం సన్నద్ధమవుతున్నారు. గ్రామస్థాయి నేతలు వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.**

తెలంగాణ బ్యూరో నిఘా, మే 22 (తీన్మార్ న్యూస్): రాజకీయ మోజు ఎందరో జీవితాలను అతలాకుతలం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నత స్థానంలో ఉన్న రాజకీయ నాయకుడి పరిస్థితి ఏమో కానీ, గ్రామ,మండల,జిల్లా స్థాయిలో రాజకీయం చేసే నాయకుల ఖర్చులు తడిసి మోపెడౌతున్నాయి. సర్పంచ్,ఎంపీటీసీ,ఎంపీపీ, జడ్పీటీసీ,సింగిల్ విండో చైర్మన్, నామినేటెడ్ పదవులు అనుభవించే వారు సైతం సంపాదించేది దేవుడెరుగు అడ్డగోలు ఖర్చులు గుదిబండలా మారుతున్నాయి.అధికార హోదా,దర్పం కోసం చేస్తున్న ఖర్చులు పెరిగి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. పదవుల మీద వ్యామోహంతో ఎన్నికల్లో తలపడి కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఈ సందర్భంగా సంసార జీవితాలు అతలాకుతలమైన పట్టించుకోకుండా

మిగతా 2 లో






## మత్స్యకార వృత్తి వివాదాలపై కమిటీకి హైకోర్టు ఆదేశాలు

ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ హైకోర్టు జస్టిస్ నగేశ్ భీమపాక తీర్పు

తెగలను పరిగణనలోకి తీసుకోకపోవడంపై పిటిషన్లు

హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): మత్స్యకార వృత్తికి సంబంధించి వివాదాల పరిష్కారానికి కమిటీ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పలు తెగలను మత్స్యశాఖలో చేరుస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్ణయం

మిగతా 2 లో



## వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ ఝలక్

టోల్‌ప్లాజల వద్ద జూన్ 2 నుంచి పెరగనున్న రుసుములు

జూన్ 1 అర్ధరాత్రి నుంచి టోల్ ధరలు పెరుగనున్నట్లు ప్రకటన

తెలంగాణ బ్యూరో, మే 22 (తీన్మార్ న్యూస్): వాహనదారులకు ఎన్‌హెచ్ఏఐ (జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) ఝలక్ ఇచ్చింది. టోల్‌ప్లాజల వద్ద రుసుములు జూన్ 2 నుంచి పెరగనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఏటా ఏప్రిల్ 1న ఛార్జీలు పెరగాల్సి ఉండగా ఈ సారి ఎంపీ ఎన్నికల కారణంగా పెంపు ప్రక్రియ వాయిదా

మిగతా 2 లో



## సుచిత్ర భూ వివాదం

### వివాదం కాస్త సవాళ్ళుగా పరిణితి మాజీ మంత్రి మల్లారెడ్డి, లక్ష్మణ్ అండ్ టీమ్ మధ్య అంతులేని తంతు

హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ సుచిత్ర సర్కిల్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డి ఫ్యామిలీ, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ అండ్ టీమ్ మధ్య భూవివాదం నెలకొంది. దానికి సంబంధించిన వ్యవహారం నాలుగు రోజుల క్రితం పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఇరుపక్షాల ఫిర్యాదు మేరకు రెండు వర్గాలపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఈ వివాదం రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. సుచిత్ర భూమి విషయంలో మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ మధ్య సవాళ్ల పర్వం నడుస్తోంది. తమ డాక్యుమెంట్సే కరెక్ట్ అని మల్లారెడ్డి, కాదు తమ డాక్యుమెంట్సే కరెక్ట్ అని లక్ష్మణ్, ఆ భూమి కోసం పోరాటం

మిగతా 2 లో

## బీజేపీ, కాంగ్రెస్ ప్రచార సరళిపై ఈసీ ఆగ్రహం వ్యక్తం

### ప్రచారంలో కుల,మత ప్రస్తావనలపై కన్నెర్ర

బీజేపీ నేత జేపీ నడ్డా, కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గేలకు నోటీసులు జారీ

తెలంగాణ బ్యూరో, మే 22 (తీన్మార్ న్యూస్): బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సరళిపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రచారంలో కుల, మత ప్రస్తావనలను తీసుకురావడంపై కన్నెర్ర చేసింది. ఈ మేరకు

మిగతా 2 లో





## అక్రమార్జనతో కోట్లుకు పడగలేత్తిన అధికారులపై "సర్కార్" కన్నెర్ర

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సీసీఎస్ ఏసీపీ అరెస్ట్

రాణా మొత్తం ట్రాన్స్ ఫర్ చేసి సరి కొత్త రికార్డ్

సివిల్ తాగాదాల్లో తలదూర్చినోళ్లనూ వదల్లే

పోలీసు శాఖలో హాట్ టాపిక్ గా కరెప్షన్

తెలంగాణ బ్యూరో నిఘా, మే 22 (తీన్మార్ న్యూస్): పదేండ్లు వాళ్లు పాడిందే పాట చెప్పిందే వేదం, వాళ్ల మాటే శిలాశాసనం అవినీతి, బంధు ప్రీతి అంతా ఇంతా కాదు. కోట్లు కొల్లగొట్టారు, కోట్లకు పడగలెత్తారు. అక్రమార్జనలో అనకొండలు, సాధారణ ప్రజలంటే లెక్కేలేదు. గత పాలకుల అడుగులొత్తుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వారిపై సర్కారు సీరియస్ గా దృష్టి సారించింది. పోలీసుల శాఖలో అవినీతిపై విచారణ ప్రారంభించడంతో కలుగులో ఉన్న ఎలుకలన్నీ బయటకు వస్తున్నాయ్. ఆదాయానికి మించి ఆస్తులున్న కేసులో సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వర్ రావును

మిగతా 2 లో

## సోనియా బలి దేవత అన్న రేవంత్‌రెడ్డికి ఇప్పుడు దేవత

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల చీఫ్ గెస్ట్ ఆహ్వానంపై కిషన్ రెడ్డి వాఖ్యలు

సోనియా గాంధీని గెస్ట్‌గా పిలవడాన్ని వ్యతిరేకించిన కిషన్ రెడ్డి



హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయిన నేపథ్యంలో ఈ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రభుత్వం ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీని పిలవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంపై కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి రియాక్ట్ అయ్యారు. హైదరాబాద్

మిగతా 2 లో

## టీజీఎస్‌ఆర్టీసీగా మారిన టిఎస్‌ఆర్టీసీ పేరు

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆర్టీసీ సంస్థ నిర్ణయం

ఎక్స్ ఖాతాల్లో కూడా టీఎస్‌ఆర్టీసీ స్థానంలో టీజీఎస్‌ఆర్టీసీగా మార్పు

హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): టిఎస్‌ఆర్టీసీ పేరును టీజీఎస్‌ఆర్టీసీగా మార్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆర్టీసీ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ సంస్థకు సంబంధించిన అధికారిక ఎక్స్ ఖాతాల్లో కూడా టీఎస్‌ఆర్టీసీ స్థానంలో టీజీఎస్‌ఆర్టీసీ అని చేర్చారు. ఈ మేరకు తెలంగాణ

మిగతా 2 లో

## బ్యారేజీల లీపేజీల వివరాలకు ఇంజినీర్లను ఆదేశించిన ఇరిగేషన్ శాఖ

### ఈ నెల 25 వరకు బ్యారేజీల స్థితిగతుల వివరాలకు డెడ్ లైన్

హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్లానింగ్, కుంగడం, లీపేజీలు ఏర్పడటం వరకు అన్ని వివరాలు ఈ నెల 25లోగా

మిగతా 2 లో





## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా జేడీ లక్ష్మినారాయణ

### గులాబీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వాలంటూ కోరిన జేడీ

.. వివరాలు 2లో

## బాంబులతో వరంగల్ బస్టాండ్ కూల్చివేత

అర్ధరాత్రి డిటోనేటర్లతో నేల మట్టమైన ఆర్టీసీ సిటీ బస్టాండ్

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ స్థానికులు



.. వివరాలు 2లో

# సు"చిత్ర" భూ వివాదం

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. అయితే వివాదం తారాస్థాయికి చేరడంతో వివాదాస్పద భూమిలో రెవెన్యూ అధికారులు సర్వే రిపోర్ట్ రెడీ చేశారు. తన అల్లుడు, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆ భూమికి సంబంధించిన పలు కీలక విషయాలను పంచుకున్నారు మల్లారెడ్డి మీడియా సందర్భంగా. ఆ భూమిని 14 ఏళ్ల క్రితమే తాము కొనుగోలు చేశామని కానీ కొందరు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు మల్లారెడ్డి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కు మళ్లీ సవాల్ విసిరారు. ఆయన ఆరోపణలపై విచారణ జరపాలని ఒకవేళ తమది తప్పని తేలితే భూమిని వారికి ఇచ్చేందుకు సిద్ధమన్నారు మల్లారెడ్డి. భూములు కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు మల్లారెడ్డి. తమకు కావాల్సినంత ల్యాండ్ బ్యాంక్ ఉందని భూములు ఎక్కువ ఉన్నందువల్లే కొందరు వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. భూ వివాదానికి సంబంధించి సీఎం రేవంత్ అపాయింట్‌మెంట్ అడిగామని అపాయింట్‌మెంట్ దొరికితే అన్ని పత్రాలు ఇచ్చి వివరిస్తామన్నారు మల్లారెడ్డి. సుచిత్ర భూమి విషయంలో కావాలనే కొందరు తమపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు మల్లారెడ్డి అల్లుడు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి. సుచిత్ర దగ్గర భూములు కొన్నామని చెప్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ ఒక్క రూపాయి అయినా చెల్లించినట్టు చూపించగలరా అని ప్రశ్నించారు. ఒకవేళ డబ్బులు చెల్లించినట్లు ఆధారాలు చూపిస్తే భూమి విషయంలో ఎలాంటి చర్యలకైనా రెడీ అన్నారు మర్రి రాజశేఖర్‌రెడ్డి.

# బీజేపీ, కాంగ్రెస్ ప్రచార సరళిపై ఈసీ ఆగ్రహం వ్యక్తం

మొదటి పేజీ తరువాయి

స్టార్ క్యాంపెయినర్ల తీరు మార్చుకొనేలా సూచించుకోవాలని ఆదేశిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు ఈసీ బుధవారం నోటీసులు జారీ చేసింది. రాజకీయ ప్రచారంలో భాగంగా ఆరోపణలు ప్రత్యారోపణల కారణంగా ఎన్నికల వ్యవస్థపై భారత ఓటరుకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఈసీ ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించదని స్పష్టం చేసింది. ప్రచారంలో భాగంగా మతపరమైన అంశాలకు దూరంగా ఉండాలని బీజేపీ, కాంగ్రెస్ లను హెచ్చరించింది. సమాజంలో విభజనకు దారి తీసే ప్రసంగాలను ఆపాలని బీజేపీకి స్పష్టం చేయగా రాజ్యాంగం రద్దు అవుతుందనే తప్పుడు అభిప్రాయం కలిగించే ప్రకటనలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ ను ఆదేశించింది. అలాగే అగ్నివీర్ వంటి పథకాలపై ప్రసంగాలు చేసేటప్పుడు సాయుధ బలగాలను రాజకీయం చేయవద్దని సూచించింది. పరస్పర ఆరోపణల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని ఈ విషయంలో అధికార పార్టీకి, ప్రతిపక్ష పార్టీలకు మినహాయింపు లేదని పేర్కొంది.

# మత్స్యకార వృత్తి వివాదాలపై కమిటీకి హైకోర్టు ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

తీసుకుంది. అయితే, కొన్ని తెగలకు సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వడం లేదు. దీంతో ఆ తెగలను పరిగణనలోకి తీసుకోకపోవడంపై దాఖలైన సుమారు 28 పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఇటీవల తీర్పు చెప్పారు. వివాదాల పరిష్కారం కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిపుణుల కమిటీని 3 నెలల్లో ఏర్పాటు చేసి, మరో మూడు నెలల్లో రిపోర్టు ఇవ్వాలని హైకోర్టు చెప్పింది. ఆ నివేదిక అందాక ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించింది. బెస్త బోయి, గంగపుత్ర, గూండ్ల తెగలను చేపలు పట్టే వృత్తిలోకి పరిగణనలోకి తీసుకోకపోవడంపై నిపుణుల కమిటీని ఏర్పాటు లేదా ఈ వివాదాన్ని బీసీ కమిషన్‌కు నివేదించాలంటూ 2018 నుంచి 28 వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. మత్స్యకారుల సహకార సంఘాల్లో ఈ తెగలకు సభ్యత్వం ఇవ్వకపోవడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. సహకార సంఘాల్లో సభ్యత్వానికి, నైపుణ్య పరీక్ష నిర్వహించడానికి జిల్లా మత్స్యశాఖ అధికారులు వెల్లడించిన ప్రొసీడింగ్స్‌ను కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ప్రభుత్వం, పిటిషనర్ల తరఫు వాదనలు విన్న తర్వాత నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

# వాహనదారులకు ఎన్‌హెచ్‌ఐఏ ఝలక్

మొదటి పేజీ తరువాయి

పడింది. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో ఎలక్షన్స్ జరగనుండగా చివరి విడత జూన్ 1న ము-గియనుంది. దీంతో ఆ రోజు అర్ధరాత్రి నుంచి టోల్ ధరలు పెరగనున్నాయి. టోల్ రుసుములు సగటున 5 శాతం పెరగనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ మేరకు టోల్ ప్లాజా నిర్వహకులకు సంస్థ రహదారుల ప్రాధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది.

**5 శాతం పెంపు**

ఇక టోల్ చార్జీల పెంపు ప్రస్తుతం వసూలు చేస్తున్న మొత్తంపై 5 శాతం పెరగనున్నాయి. ఒక వాహనానికి రూ.100 వసూలు చేస్తుంటే దానిపై 5 శాతం అంటే రూ.5 పెరిగి జూన్ 2 నుంచి రూ.105 వసూలు చేస్తారు. అప్‌అండ్‌డౌన్ చార్జీలు రూ.210 వసూలు చేస్తారు. గతంలో కారు, ప్యాసింజర్ వ్యాన్‌లతోపాటు లైట్ కమర్షియల్ వాహనాల టోల్ రుసుము పెంచలేదు. రెండేళ్లుగా వాటిని కూడా పెంచుతున్నారు.

# అక్రమార్జనతో కోట్లుకు పడగలేత్తిన అధికారులపై "సర్కార్" కన్నెర్ర

మొదటి పేజీ తరువాయి

అరెస్టు చేయడం కలకలం రేపింది. రెండు రాష్ట్రాల్లో ఏసీబీ సోదాలు జరపడం చర్చనీయాంశంగా మారింది. అంతకు ముందు ఫోన్ల ట్యాపింగ్ కేసులో ఎస్‌ఐబీ ఇన్ స్పెక్టర్ గా పనిచేసిన ప్రణీత్ రావును అరెస్టు చేసిన విషయం తెలిసిందే అదే కేసులో పోలీసు అధికారులు భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావు అరెస్టయి జైల్లో ఉన్నారు. ఎస్ ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కు రెడ్ కర్నార్ నోటీసులు జారీ కాబోతున్నాయి. ఈ కేసు ఓ వైపు సాగుతుండగానే మరో ఉమా మహేశ్వర్ రావు అక్రమాస్తులు చిట్టా బయటికి రావడం కలకలం రేపింది. ఇంత జరుగుతున్నా గత పాలకులు ఏం చేశారన్నది హాట్ టాపిక్ గా మారింది. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ కేసును తారుమారు చేసేందుకు యత్నించిన పంజాగుట్ట సీఐ దుర్గారావుపై సర్కారు సస్పెన్షన్ వేటు వేసింది. ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలించి సంచలన నిర్ణయం తీసుకున్నది. ఠాణా మొత్తాన్ని ట్రాన్స్ ఫర్ చేయడం కలకలం రేపింది. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులపై చిన్నపాటి ఆరోపణలు వచ్చినా వదలడం లేదు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు పోలీసులు ఓ వ్యక్తిని నిర్బంధించిన కేసులో ఇన్ స్పెక్టర్ వెంకటేశ్ పై వేటు పడింది. భార్యాభర్తల వివాదంలో తలదూర్చిన ఆర్జీఐఏ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసులపైనా వేటు పడంది. లోక్ సభ ఎన్నికల వేళ కీసరలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు రూ. 5 లక్షలు చిక్కడం వాటిని ఇద్దరు కానిస్టేబుళ్లు నొక్కేయడం బయటికి రావడంతో అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు శ్రీకాంత్ యాదవ్, కృష్ణలను సస్పెండ్ చేసింది ప్రభుత్వం. పోలీసు శాఖను ప్రక్షాళన చేయడం ద్వారా రాష్ట్రంలోని అవినీతి అధికారు వెన్నులో వణుకు మొదలైంది.

# సోనియా బలి దేవత అన్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు దేవత

మొదటి పేజీ తరువాయి



నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూన్ 2వ తేదీన ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల కార్యక్రమానికి సోనియా గాంధీని పిలవడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పాలిట సోనియా బలి దేవత అన్నా రేవంత్ రెడ్డికి ఇప్పుడు ఆమె దేవద అయ్యిందా అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ కార్యక్రమైన ఆవిర్భావ దినోత్సవ వేడుకల ప్రోగామ్‌కు ఏ ప్రతిపాదికనా సోనియా గాంధీని పిలుస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోనియా గాంధీ వల్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రాలేదని, అమర వీరుల త్యాగాల వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో ఆలస్యం చేసి వందల మందిని ఉద్యమకారులను బలితీసుకున్న సోనియా గాంధీని.. ఆవిర్భావ దినోత్సం కార్యక్రమానికి పిలవడం ఏంటని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

# స్థానిక సమరం

మొదటి పేజీ తరువాయి




రాజకీయంలో ముందుకే వెళ్లాల్సిన పరిస్థితులు కొందరికి ఏర్పడుతున్నాయి. ఎన్నికల్లో ఓడిన వారు పెట్టిన ఖర్చు వెనక్కి రాక నష్టపోతే, గెలిచిన వారు హోదా తగ్గకుండా చేసే ఖర్చులతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

సర్పంచ్ లకు గ్రామాల్లో హోదాతో పాటు గౌరవం కూడా ఉంటాయి. ప్రతి ఒక్కరూ సర్పంచ్ సాబ్ అని సంబోధిస్తారు. తదనంతరం కూడా సర్పంచిగా పనిచేశారని ఎప్పుడు పేరు ఉంటుంది. ప్రభుత్వ నుండి కూడా గ్రామపంచాయతీలకు నిధులు వస్తుండడంతో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకునే వీలుంటుంది. ఆర్థిక సంఘం నిధులతో పాటు వివిధ రకాల గ్రాంట్లు గ్రామపంచాయతీలకు వస్తున్నాయి. గ్రామంలో ప్రతీ కార్యక్రమం సర్పంచ్ ద్వారానే జరుగుతుంది. అందుకే ఎలాగైనా ఈసారి సర్పంచ్ కావాలని చాలామంది ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. అలాగే ఎంపీటీసీ పరిధిలోను ఒకటి లేదా రెండు గ్రామాలు ఉంటాయి. జడ్పిటిసికి మండల పరిధి ఉంటుంది. జిల్లా పరిషత్ సమావేశాల్లో జడ్పిటిసిలే పాల్గొంటారు. మండల పరిషత్ సమావేశాల్లో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొంటారు. ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచ్ లకు ప్రతి సమావేశంలో ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానం ఉంటుంది. ఏ అధికారిక కార్యక్రమం అనధికారిక కార్యక్రమాలు జరిగినా వీరిని ఆహ్వానించడం ఆనవాయితీ. తమ పలుకుబడితో తహసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్లో గ్రామస్తుల పనులు చక్కబెడతారు. దీంతో సహజంగానే ఈ పదవి ఎలాగైనా సంపాదించాలనే ఉత్సాహం పలువురిలో కనిపిస్తోంది. అయితే ఈ పదవులను దక్కించుకోవడం అంత ఈజీ వ్యవహారం కాదు. ఎందుకు ప్రజల్లో మంచి పేరు ఉండడంతో పాటు.. వ్యూహాలు ఎత్తుగడలు ఉండాలి. దీనికి తోడు డబ్బు ముఖ్య భూమిక పోషిస్తుంది. కాగా అవసరమైతే రూ.50 లక్షల నుండి కోటి రూపాయలైనా పెట్టేందుకు.. పదవులు సాధించేందుకు.. పలువురు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లోను చాలా చోట్ల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు రూ. 20 నుండి రూ. 50 లక్షల వరకు ఖర్చు చేశారు. జడ్పిటిసిల ఖర్చు ఎక్కువగానే ఉంటుంది. కొన్ని గ్రామాల్లో రూ. 50 లక్షల నుండి కోటి రూపాయల వరకు కూడా సర్పంచ్ పదవి కోసం ఖర్చు పెట్టారంటే అతిశయోక్తి కాదు. ఇదిలా ఉంటే సర్పంచ్ గా పోటీ చేసేందుకు పార్టీల బీఫారం అవసరం లేకున్నా.. ప్రధాన పార్టీల మద్దతు ఉండాలి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోటికి పార్టీ బీఫారం కోసం టికెట్లు ఆశిస్తున్న వారు ఇప్పటినుండే ఆయా పార్టీల నేతలను, ఇంచార్జీలను కాక పడుతున్నారు. తాజా మాజీ సర్పంచులు, సిట్టింగ్ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తిరిగి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మళ్లీ వీరికి పార్టీలు మద్దతు ఇస్తాయా? బీఫారాలు ఇస్తాయా? అనేది తేలాల్సి ఉంది. టికెట్ దక్కని కొందరు చాలెంజ్ గా తీసుకొని రెబెల్స్ గా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తుంటారు. ఆయా పార్టీల నుండి టికెట్లు ఆశిస్తున్న ఔత్సాహికులను బుజ్జగించి టికెట్లు ఇవ్వడం కూడా నియోజకవర్గ ఇంచార్జిలకు తలనొప్పి వ్యవహారమే. స్థానిక ఎన్నికల్లో ఎక్కువ మందిని గెలిపించుకొని తమ సత్తా నిరూపించుకోవడం కూడా నియోజకవర్గ పార్టీ ఇంచార్జీలకు సవాలే. గడచిన పదేళ్ల కాలంలో కొందరు రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో ఇబ్బడిముబ్బడిగా సంపాదించారు. మరికొందరు ఎన్నారైల తల్లిదండ్రులు కూడా ఆర్థికంగా బలపడ్డారు. వీరు సర్పంచులుగా, ఎంపీటీసీలుగా పోటీ చేయడానికి ఎంతైనా ఖర్చు పెట్టడానికి వెనుకడమని బహిరంగంగా చెప్తున్నారు. గత ఎన్నికల్లోనే ఒక ఓటుకు సుమారు రూ. వెయ్యి నుండి రూ.5 వేల వరకు ఖర్చు పెట్టారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా గెలుపు గుర్రాల కోసం నియోజకవర్గ ఇన్చార్జిలు అన్వేషిస్తున్నారు. ఈ ఎన్నికల్లో డబ్బులే ముఖ్యమైనందున డబ్బులు లేనిదే పోటీకి ముందుకు రావద్దని కుండ బద్దలు కొడుతున్నారు. ఏది ఏమైనా మరి కొద్ది రోజుల్లో స్థానిక సమరం ప్రారంభం కానుంది. ఇందుకోసం అస్త్ర శాస్త్రాలను రాజకీయ పార్టీలు, ఆశావహులు సిద్ధం చేసుకుంటున్నారు.

# టీజీఎస్‌ఆర్టీసీగా మారిన టీఎస్‌ఆర్టీసీ పేరు

మొదటి పేజీ తరువాయి




ఆర్టీసీ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ అధికారిక ప్రకటన చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్‌ఆర్టీసీ పేరును టీజీఎస్‌ఆర్టీసీగా మార్చడం జరిగింది. ఆ మేరకు అధికారిక ఎక్స్ ఖాతాలను ఏ%స్త్రంతీఏఎఎంశీటటఅఎవ, వ్స్త్రంతీఎష్త్రన% లుగా సంస్థ మార్చింది. మీ విలువైన సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులను మార్చిన ఈ ఖాతాల ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను సంస్థ కోరుతోంది. టీజీఎస్‌ఆర్టీసీ అందిస్తోన్న సేవల గురించి తెలుసుకునేందుకు ఏ%స్త్రంతీఏఎఎంశీటటఅఎవ, వ్స్త్రంతీఎష్త్రన% ఖాతాలను ఫాలో అవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది. అని సజ్జనార్ పేర్కొన్నారు. ఇక, తెలంగాణ ప్రభుత్వ విభాగాలలో తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్ బదులుగా టీజీగా ప్రస్తావించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మే 17న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసే జీవోలు, పాలసీ పేపర్లు, సర్క్యులర్స్, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లలో టీఎస్‌కు బదులు టీజీని వినియోగించాలని ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటానమస్ విభాగాలు, అన్ని ప్రభుత్వ సంస్థలు ఈ ఉత్ర్వులను పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు అధికారిక సంక్షిప్తీకరణ టీజీగా భారత ప్రభుత్వం ఆమోదించిందని, తదనుగుణంగా, రాష్ట్ర స్థాయిలో కూడా టీజీని అధికారిక సంక్షిప్తీకరణగా స్వీకరించాలని నిర్ణయించడం జరిగిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఇకపై ప్రభుత్వంకు సంబంధించిన వ్యవహారాల్లో తెలంగాణ సంక్షిప్త పదంగా టీఎస్‌కు బదులు టీజీ కనిపించనుంది.

# పది సప్లిమెంటరీ పరీక్షలపై కీలక ప్రకటన

**జూన్ 3 నుంచి 13 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడి**

**ఆలస్య రుసుముతో పరీక్షకు 2రోజుల ముందు ఫీజు చెల్లించే వెసులుబాటు**

హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): పది సప్లిమెంటరీ పరీక్షలపై డీఈవో సోమశేఖర శర్మ కీలక ప్రకటన చేశారు. జూన్ 3 నుంచి జూన్ 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎగ్జామ్స్ జరుగుతాయని తెలిపారు. రూ.50 ఆలస్య రుసుముతో పరీక్ష తేదీ రెండు రోజుల ముందు వరకు కూడా ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పించారు.

**సప్లిమెంటరీ పరీక్షల పూర్తి షెడ్యూల్ ఇలా**

- జూన్ 3 – తెలుగు, కాంపోజిట్ పరీక్ష–1, కాంపోజిట్ పరీక్ష –2
- జూన్ 5 – సెకండ్ లాంగ్వేజ్
- జూన్ 6 – ఇంగ్లీష్
- జూన్ 7 – మ్యాథ్స్
- జూన్ 8 – ఫిజిక్స్
- జూన్ 10 – జీవశాస్త్రం
- జూన్ 11 – సోషల్ స్టడీస్
- జూన్ 12 – ఓన్‌ఎస్‌ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ (సంస్కృతం, అరబిక్) పేపర్ –1
- జూన్ 13 – ఓన్‌ఎస్‌ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ –2

# భైంసాలో ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారి

***ఇంటి నిర్మాణ అనుమతులకు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మున్సిపల్ కమిషనర్***



నిర్మల్, మే 22 (తీన్మార్ న్యూస్): భైంసాలో అవినీతి అధికారి ఏసీబీకి చిక్కారు. ఓ ఇంటి నిర్మాణం కోసం అనుమతులు ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు. భైంసా మున్సిపల్ కార్యా లయంలో బుధవారం (మే 22) ఏసీబీ అధికారులు జరిపిన దాడుల్లో లంచం తీసుకుంటుండగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్ లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. భైంసా పట్టణ పరిధిలో పురానం బజార్ కు చెందిన రాదేశం అనే వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతుల ఇచ్చేందుకు వెంకటేశ్వరు లంచం డిమాండ్ చేశారు. బాధితు డిని డబ్బులు తీసుకుంటుండగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బిల్ కలెక్టర్ విద్యాసాగర్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎవరైనా అధికా రులు లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ఏసీబీ అధికారులు.

# బాంబులతో వరంగల్ బస్టాండ్ కూల్చివేత

వరంగల్, మే 22 (తీన్మార్ న్యూస్): బాంబులతో బస్టాండ్ కూల్చివేశారు. ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. అయితే వరంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో పాత భవనం తొలగింపు పనులు చకచకా జరుగుతున్నాయి. కొత్త బస్టాండ్ నిర్మాణంలో భాగంగా సిటీ బస్ స్టేషన్‌ను మంగళవారం అర్ధరాత్రి తర్వాత జనసంచారం లేని సమయంలో జిలెటిన్ స్టిక్స్ వాడి భవనాలను కూల్చి వేశారు. ఆదే ప్రాంతంలో రూ.70కోట్లతో అధునాతన బహుళ అంతస్తుల మోడల్ బస్ స్టేషన్ నిర్మిస్తున్నారు.

వరంగల్‌లోని ఆర్టీసీ సిటీ బస్టాండ్‌ను అర్ధరాత్రి డిటోనేటర్లతో నేల మట్టం చేశారు. జన సంచారం లేని సమయంలో బాంబులతో ఒక్క పెట్టున కూల్చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ పాత భవనాల తొలగించి కొత్త భవనాలు నిర్మించేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. రూ.70కోట్లతో మోడల్ బస్టాండ్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. బహుళ అంతస్తులలో మోడల్ బస్ స్టేషన్ నిర్మించనున్నారు. అయితే దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన పాత బస్టాండ్ పటిష్టంగా ఉంది. తొలగింపు అసాధ్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో నిర్మాణంలో సిటీ బస్ స్టేషన్ ను అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత జనసంచారం లేని సమయంలో జిలెటిన్ స్టిక్స్ తో భవనాలను కూల్చి వేశారు. పురాతన భవనాలు దృఢంగా ఉండటంతో ఎక్స్‌క్యూవేటర్లతో కూల్చడం సాధ్యం కాకపోవడంతో, కూల్చివేతలకు పేలుడు పదార్థాలు ఉపయోగించినట్లు సిబ్బంది తెలిపింది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా జేడీ లక్ష్మినారాయణ

తెలంగాణ బ్యూరో, మే 22 (తీన్మార్ న్యూస్): రాజకీయ పార్టీ పదలో ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర రావు కోసం రంగంలోకి దిగారు జెడి లక్ష్మీనారాయణ. సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ అయిన జెడి లక్ష్మీనారాయణ ప్రస్తుతం రాజకీయాలలో రాణించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేసిన వెంటనే జనసేన పార్టీలో చేరిన జేడీ లక్ష్మీనారాయణ పవన్ కళ్యాణ్ వ్యక్తిగత నిర్ణయాలు, తదితర అంశాల నేపథ్యంలో ఆ పార్టీ నుంచి బయటికి వచ్చారు. అప్పటినుంచి రాజకీయాల్లోనే కొనసాగుతున్న జేడీ లక్ష్మీనారాయణ తాజాగా కీలక ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ కు మద్దతు తెలిపారు మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి కొనసాగుతోంది. నల్గొండ, వరంగల్ అలాగే ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ ఇటీవల రిలీజ్ అయింది. ఈనెల చివర్లో ఈ ఎన్నిక నిర్వహించనున్నారు. దీంతో గులాబీ పార్టీ, కాంగ్రెస్ అలాగే బిజెపి పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించి దూసుకు వెళ్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో గులాబీ పార్టీకి జేడీ లక్ష్మీనారాయణ తన మద్దతు తెలిపారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపయోగి ఎన్నికల్లో గులాబీ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి ఓటు వేయాలని పట్టభద్రులను కోరారు జెడి లక్ష్మీనారాయణ.

ఏనుగుల రాకేష్ రెడ్డి గెలిస్తే యువతకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. చదువుకున్న వ్యక్తి ఎమ్మెల్సీ అయితేనే.. అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. దీంతో ఆపదలో ఉన్న కేసీఆర్ పార్టీని ఆదుకునేందుకు మరో మాజీ ప్రభుత్వాధికారి రంగంలోకి దిగారని తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే మాజీ ఐఏఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గులాబీ పార్టీలో చేరి ఎంపీగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు జెడి లక్ష్మీనారాయణ కూడా గులాబీ పార్టీ కోసం రంగంలోకి దిగారు. కాగా ఈ ఉప ఎన్నికల్లో ముఖ్యంగా తీన్మార్ మల్లన్న వర్సెస్ ఏనుగుల రాకేష్ రెడ్డి మధ్య పోటాపోటీ నెలకొంది.

# బ్యారేజీల లీపేజీల వివరాలకు ఇంజినీర్లను ఆదేశించిన ఇరిగేషన్ శాఖ

మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని ఇంజినీర్లను ఇరిగేషన్ శాఖ ఆదేశించింది. బ్యారేజీల నిర్మాణానికి ఆమోదం, మూడింటికీ ఒకే డిజైన్లు అమలు చేశారా, పనులకు ముందు అధ్యయనం, పని కాకుండానే కాంట్రాక్టర్లకు సర్టిఫికెట్ ఇవ్వడం, నిర్మాణం, నాణ్యత తనిఖీ సహా ఏ ఒక్క అంశాన్ని దాచొద్దని స్పష్టం చేసింది. పుణె నుంచి వస్తున్న సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్(సీడబ్ల్యూపీఆర్ఎస్)కు చెందిన నిపుణులు కాళేశ్వరం బ్యారేజీలను బుధవారం పరిశీలించారు. సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు టెక్నికల్ నిపుణులు బ్యారేజీలను పరిశీలిస్తారని అధికారులు చెప్పారు. అక్కడ ఎన్డీటీ (నాన్ డిస్ట్రక్టివ్ టెస్ట్ ) తో పాటు జియోఫిజికల్, జియో టెక్నికల్ టెస్టులు చేస్తారని వెల్లడించారు. ఫ్లడ్‌కు తగ్గట్టు ఇప్పుడున్న సిమెంట్ బ్లాకులు, బ్యారేజీలోని నిర్మాణాలు తట్టుకుంటాయా? లేదా? అని పరీక్షిస్తారని చెప్పారు. తొలుత అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించి, ఆ తర్వాత మేడిగడ్డ బ్యారేజీ వద్ద టెస్టులు చేస్తారని అధికారులు చెప్తున్నారు. మరోవైపు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), ఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్)ల నిపుణులు రెండు రోజుల తర్వాత బ్యారేజీల వద్ద టెస్టులు చేస్తారని, దానికి సంబంధించిన ప్రజెంటేషన్ ఇస్తారని పేర్కొంటున్నారు. కాగా, మూడు బ్యారేజీల వద్ద రిపేర్ల పనులు, ఖర్చులను నిర్మాణ సంస్థలే భరించనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

# ఈనెల 24న రాష్ట్రంలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష



హైదరాబాద్, మే 22 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 3 సంవత్సరాల ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్ ఈనెల 24న జరగనుంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 92,808 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఎంపీసీ విభాగంలో మొత్తం 56764 అప్లికేషన్లు రాగా అందులో బాలురు 34,012, బాలికలు 22,752 మంది దరఖాస్తు చేసుకున్నారు. బైపీసీ విభాగంలో మొత్తం 36,044 అప్లికేషన్లు రాగా బాలురు 17,606, బాలికలు 18,438 మంది దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులకు అనుగుణంగా మొత్తం 259 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌బీటీఈటీ కార్యదర్శి వివరించారు. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోరని స్పష్టంచేశారు. హాల్ టికెట్‌పై ఫోటో ప్రింట్ కాని అభ్యర్థులు ఒక పాస్ పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డ్‌ను తీసుకురావాలని సూచించారు. ఇదిలా ఉండగా పరీక్ష కేంద్రాన్ని గుర్తించడానికి వీలుగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. విద్యార్థులు ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్ ద్వారా గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'ఎస్‌బీటీఈటీ టీజీ' అనే యాప్‌ని డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలన్నారు. పరీక్ష కేంద్రం లొకేషన్ కోసం పాలిసెట్ ఎగ్జామ్ సెంటర్ లొకేటర్ ఆప్షన్ ను నొక్కాలని, అక్కడ హాల్ టికెట్ నంబర్‌ను ఎంటర్ చేసి సెర్చ్ చేయాలని సూచించారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## ప్రభుత్వ బడులకు పూర్వవైభవం

2024- 25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ ప్రారంభించనున్న దృష్ట్యా బడులు ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. పంచాయతీ రాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఎలక్ట్రీషియన్, కూలిన గోడలను పునః నిర్మాణం, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం, పేయింటింగ్ ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ అమ్మ పాఠశాలల పేరిట 2024- 25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించడం అభినందించదగిన విషయం. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో దశాబ్దాలుగా పేయింట్స్ లేకపోవడం, గోడలు పర్రెలు పర్రెలుగా ఊడిపోవడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతాయో తెలియని భయాందోళన పరిస్థితులలో కాలం గడిపేవారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో టాయిలెట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు అడ్వాన్స్ గా రూ. 125 కోట్లు విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, పాఠశాలలలో సరైన సదుపాయాలు లేకపోవడంతో పేద, బడుగు, బలహీన, ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ విద్యార్థులను వేలకు వేలు ఫీజుల రూపంలో చెల్లించి ప్రైవేటు పాఠశాలలకు పంపేవారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, సాంఘిక శాస్త్రం చిత్ర పటా లు, గ్లోబులు, ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయడం వల్ల అనేక మంది విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను వదిలి ప్రభుత్వ, ఉన్నత రాజ్ పాఠశాలల్లో చేరుటకు మక్కువ చూపుతున్నారు. 2024- 25 విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీ ప్రారంభించనున్న దృష్ట్యా బడులు ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసింది. పంచాయతీ రాజ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాలు, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఎలక్ట్రీషియన్, కూలిన గోడలను పునః నిర్మాణం, కూలడానికి సిద్ధంగా ఉన్న పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం, పేయింటింగ్ ఇతర మౌలిక సదుపాయాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.


గత ప్రభుత్వా లు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి నిర్లక్ష్య, నిర్లిప్తత వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల విద్యార్థులను రెసిడెన్షియల్ పాఠశాలలు ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలు అంటూ ప్రారంభించి చేర్పించడం వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు లేకపోవడం వలన విద్యా వ్యవస్థ కుంటుపడిపోయింది. బడులు ప్రారంభించే లోగా ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు చేయాలి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేయాలి. ఎన్నికల కోడ్ జూన్ 4 వ తేదీ వరకు ఉండడం వల్ల కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) అనుమతి తీసుకొని వీలైనంత త్వరగా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలి. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తర్వాత పరిపాలనపై దృష్టి కేంద్రీకరిస్తానని చెప్పడం విద్య, వైద్యానికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానని అనడంతో ఉపాధ్యాయులు ఎంతో సంతోషిస్తున్నారు. గతంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం హైకోర్టు స్టే ఇవ్వడం వలన ఆగిపోయింది. కేసు పూర్వాపరాలు పరిశీలించి వాద వివాదాల తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేసుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వానికి సూచనలు చేసింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉన్న కేసులన్నీ ప్రభుత్వ అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఇప్పుడు బంతి ప్రభుత్వ కోర్టులో ఉంది. గతంలో జిఒ 317 స్థానికేతర సమస్యలు, స్పౌజ్ కేసులు, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు పాయింట్లు కేటాయించడం, పదోన్నతుల కోసం టీచర్స్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత, భాషా పండితుల పోస్టులు భాషా పండితులకే ఇవ్వాలని, రంగారెడ్డి జిల్లా లో స్థానికులు స్థానికేతరులు మారడం, సీనియర్ ఉపాధ్యాయులు జూనియర్ ఉపాధ్యాయులుగా మారిన కేసులు మొదలైన అనేక సమస్యలకు పరిష్కారం తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ద్వారా లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, బడులు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడి అరికట్టాలి


- యదేచ్ఛగా సాగుతున్న ప్రైవేట్ హాస్పిటల్స్ దందా
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్ దవాఖానలు
- లక్షలు పెడుతున్నా ప్రాణాలకు భరోసా కరువు
- పేరుగొప్ప ఊరుదిబ్బ...ప్రైవేటు దవాఖానలు
- పేరుకే సూపర్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్
- వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు
- అరకొర వసతులతో దవాఖానల ఏర్పాటు
- వైద్యుల అర్హతలపై కొరవడిన నిఘా
- రోగుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు
- హంగు ఆర్భాటాలు ఫుల్.. సౌకర్యాలు నిల్
- పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం
- బిఎస్పి దేవరకద్ర ఇంచార్జి బసిరెడ్డి సంతోష్ రెడ్డి ఆరోపణ







దేవరకద్ర ప్రతినిధి, మే 22(తీన్మార్ న్యూస్): ప్రైవేట్ ఆస్పత్రులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాల్సిన వైద్యాధికారులు కనీసం పట్టించు కోవటం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల యజమాన్యాలు జిల్లా వైద్యాధికారులకు ముడుపులు ముట్టజెప్పటం వల్లే వాళ్లు ఏమి మాట్లాడటం లేదని బిఎస్పి దేవరకద్ర ఇంచార్జి బసిరెడ్డి సంతోష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తకోట ప్రైవేట్ హాస్పిటల్ లో జరిగిన సంఘటనపై అధికారులు మౌనం ఎందుకు చర్యలు తీసుకోవడంపై వెనుకడుగు వేస్తున్నారని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని కొత్తకోట, ఆత్మకూర్ మండలంలో ప్రైవేటు దవాఖానలపై వైద్యశాఖ అధికారుల నిఘా కరువైంది. పుట్టగొడుగుల్లా ప్రైవేటు దవాఖానలు వెలుస్తున్నాయి. పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారాయి ప్రైవేటు దవాఖానలు. కార్పొరేట్ లుక్‌తో ఏర్పాటవుతున్న దవాఖానాలు వసతులు, సౌకర్యాలు, అనుభవలేమి సిబ్బందితో వైద్యం చేయిస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయని ఆరోపణలు చేశారు. అర్హత లేకున్నా మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల పేరిట దవాఖాన బోర్డులు దర్శన మిస్తున్నాయని ఆరోపించారు. కోట్ల రూపాయలతో దవాఖానలు కట్టి, వాటిని ప్రజల నుంచే వసూలు చేయాలనే ఉద్దేశంతో కొంతమంది వైద్యులు, యాజమాన్యాలు దవాఖానలను ప్రారంభిస్తున్నారని కోరారు. దీంతో చిన్న రోగానికి చికిత్స కోసం వెళ్తే దవాఖానలో అడ్మిట్ చేసుకొని లక్షలు దండుకుంటున్నారని అన్నారు. ఎలాగోలా ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు రోగులు నిరుపేదలైనా ఆస్తులు అమ్ముకొని దవాఖానల బిల్లులు కడుతున్నారు. ఆరోగ్యం మాట అటుంచితే దవాఖాన బిల్లులను చూస్తేనే గుండె గుబేల్‌మంటున్నది. అందినకాడికి దోచుకోవడమే లక్ష్యంగా ఇష్టారీతిన గల్లీగల్లీకి ఓ దవాఖాన పుట్టుకొస్తున్నదని అన్నారు. నిబంధనలకు పాతర వేస్తూ రోగంతో సంబంధం లేకుండా ప్రతి దానికి పరీక్షలు, స్కానింగ్‌లు చేస్తూ రోగుల నుంచి వేలాది రూపాయలు గుంజుతున్నారు. దీంతో ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలకు కాసుల పంట పండుతున్నదని కోరారు. చిన్న సమస్యతో ప్రైవేటు దవాఖానకు వెళ్తే తక్కువలో తక్కువ వేలల్లో బిల్లులు వేస్తున్నారు. రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నార తెలిపారు. ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఇలా ప్రతి ఒక్కటీ ప్రైవేటు దవాఖానల కనుసన్నల్లోనే నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హంగు ఆర్భాటాలు ఫుల్.. సౌకర్యాలు నిల్ తమ దవాఖానలో అన్ని రకాల అత్యాధునిక సౌకర్యాలు,పరికరాలు ఉన్నాయంటూ ప్రచారాలు చేస్తున్న ప్రైవేటు దవాఖానలు.. క్షేత్రస్థాయిలో చూస్తే అవేం కనిపించవనే ఆరోపణలు ఉన్నాయి. అర్హతలు లేకున్నా మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానలంటూ బోర్డులు ఏర్పాటు చేస్తూ వైద్యం కోసం వస్తున్న రోగుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు చేస్తున్న దోపిడిపై నిఘా పెట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ప్రైవేటు దవాఖానలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ**






ములుగు, మే 22 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలు రెవిన్యూ శాఖ కు సంబంధించినవి (09), ఉద్యోగాలకు సంబంధించినవి (06), పెండింగ్ బిల్లులకు సంబంధించినవి (05), మొత్తం (20) దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ ఆర్డీవో సత్యపాల్ రెడ్డితో కలిసి దరఖాస్తుల స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. శాఖల వారిగా పెండింగ్ లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీనివాస్ కుమార్, డిఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ చంద్ర, డిడబ్లూఓ స్వర్ణలత లేనినా, ఎల్డిఎం రాజ్ కుమార్, సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభిరుచి రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**- స్వయం ఉపాధిని ఎంచుకున్న యువకులను అభినందన**



వనపర్తి ప్రతినిధి, మే 22(తీన్మార్ న్యూస్): వనపర్తి పట్టణం బసవన్న గడ్డ కొత్తకోట రూట్ లో పెద్దమందడి మండలం అమ్మపల్లి మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ ఏర్పాటు చేసిన అభివృద్ధి రెస్టారెంట్ ను బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధి కోసం ఎదురుచూస్తూ తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఉన్నంతలో వ్యాపారాలు చేసే యువకులు పలువురికి ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చేసే పనిపై శ్రద్ధ ఉంచి చేస్తే ఎలాంటి పని అయినా మనకు మంచి భవిష్యత్తును ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. రెస్టారెంట్ ప్రారంభించిన మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, నియోజకవర్గ అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు చీర్ల సత్యం సాగర్, లక్ష్మి రవి యాదవ్, కృష, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా గన్నపురం సింగిల్ విండో డైరెక్టర్ మండల యువ నాయకులు సాయి చరణ్ రెడ్డి, బొంబాయి మన్నెంకొండ, చుక్క రాజు, అమ్మపల్లి వెంకటేశ్వర రెడ్డి, సత్య శీలా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కురుమలు సంఘటిత శక్తిగా ఎదగాలి

**- కురుమ సంఘం మండల అధ్యక్షుడు వస్పరి సుధాకర్**



రాజాపేట, మే 22(తీన్మార్ న్యూస్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలు పార్టీలకు అతీతంగా సంఘటితశక్తిగా ఎదగాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు వస్పరి సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం రాజపేట మండల కేంద్రంలో జరిగిన కురుమ సంఘం మండల విస్తృతస్థాయి సమావేశంలో బీసీ నేత జూకంటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కురుమలు రాజ్యాధికార సాధనకు దొడ్డి కొమరయ్య వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేశారు. గొర్రెల కాపరులకు కేటాయించిన భూములు కబ్జాకు గురవుతున్న నేపథ్యంలో వాటిని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్ల పెంచుటకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ నేతలు మీస బాల మల్లయ్య, పోసుగొండ రాములు, గవ్వల సిద్దేశ్వర్, రేగు సిద్ధులు, బాల్ద శ్రీకాంత్, కాకళ్ళ ఉపేందర్, దయ్యాల శ్రీనివాస్, ఎమ్మ శ్రీను, యాదగిరి, పర్వతాలు, వెంకటేష్, తదితర నేతలు పాల్గొన్నారు.

## స్వర్ణ పతకం విజేత గణేష్ కు సన్మానం



**- చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.జలంధర్ రెడ్డి**

**- జూన్ లో జరిగే అంతర్జాతీయ స్థాయిలో కూడా గెలుపొందాలి**

**- చదువు ఒక్కటీ కాదు క్రీడల్లో రాణించాలి**

నారాయణ్ పేట జిల్లా ప్రతినిధి, మే 22(తీన్మార్ న్యూస్): నారాయణ్ పేట జిల్లా, ఉట్కూర్ మండలం, నిడుగుర్తి గ్రామానికి చెందిన ఎం గణేష్ కు నారాయణ్ పేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.జలంధర్ రెడ్డి తన నివాసంలో బుద వారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారు మూల ప్రాంతానికి చెందిన గణేష్ జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు, మంచి పేరు తెచ్చిపెట్టింది. తను ఇలాగే అత్యున్నతమైన స్థాయిలో ఎదగాలనే అభిప్రయపడ్డారు. పార్టీ తరపున సహాయం అందించడంలో తాను కృషి చేస్తాను అన్నారు.

## రేగు ఫౌండేషన్ సహకారంతో మృతుని కుటుంబానికి బియ్యం సాయం చేసిన రేగు సిద్ధులు



రాజాపేట, మే 22(తీన్మార్ న్యూస్)బీ రాజపేట మండల కేంద్రంలో గొల్లపల్లి సత్తయ్య మరణించగా బుధవారం రేగు సిద్ధులు 50 కిలోల బియ్యాన్ని అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు మానసిక ధైర్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి జానీ, గజ్జల రాజు, సంగే0 వేణు, గుర్రం శ్రవణ్, సిరిపంగ మహేష్, ఎండి ఘోరేమియా, కుటుంబ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగు సిద్ధులును పలువురు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. రాజపేట మండల కేంద్రంలో మృతుల కుటుంబాలకు మనో ధైర్యాన్ని కల్పించి ఆర్థికంగా లేక బియ్యం అందించి సాయం చేస్తున్న రేగు సిద్ధులు సేవలు వెలకట్టలేనివని గ్రామస్తులు తెలిపారు.

# గడువు లోపు పనులను పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**





గోవిందరావుపేట, మే 22 (తీన్మార్ న్యూస్): గడువులోపు అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గోవిందరావు పేట మండలం చలువాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వచ్చే విద్యా సంవత్సరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో గుర్తించబడిన పాఠశాలలో ఎలాంటి పనులు పెండింగ్ ఉండకూడదని, అత్యంత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలలో టాయిలెట్స్, తాగునీరు, లైటింగ్, తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. ములుగు జిల్లా కేంద్రం లోని గాంధీ పార్క్ లో మహిళ సంఘాల సభ్యులు సిద్ధం చేస్తున్నా ఏక రూప దుస్తులు తయారీని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజతో కలిసి పరిశీలించారు. ఏక రూప దుస్తులు విద్య సంవత్సరం ప్రారంభం అయ్యే రోజే విద్యార్థులకు పంపిణీ చేసి అధించాలని కాబట్టి త్వరిత గతిన కుట్టడం పూర్తి చేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ శ్రీనివాస్ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ , గోవిందరావు పేట మండలం ఎంపీడీవో , ఏ ఈ తదితరులు పాల్గొన్నారు

# అక్రమ కేసులో చేర్చిన మొగిలి వెంకట్ రెడ్డి పేరు తొలిగించాలి

**- ప్రశ్నించే గొంతుకలపై అక్రమకేసులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

**- కాకతీయ యూనివర్సిటీ పిడిఎస్యు కార్యదర్శి మర్రి మహేష్**



హన్మకొండ కేయు, మే 22 (తీన్మార్ న్యూస్): గత మూడు నెలల క్రితం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నేతలపై పెట్టిన పూసపల్లి కుట్ర కేసులో భాగంగా నిన్న పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకటరెడ్డిని పేరు చేర్చడం పట్ల పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకటరెడ్డి పేరును పూసపల్లి కుట్ర కేసులో చేర్చడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ఇది ప్రశ్నించే గొంతుకలను అన్నివేయడమేనని అన్నారు. గడిల పాలలను బద్దలు కొట్టి ప్రజల పాలనను తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రశ్నించే గొంతులను అణిచివేస్తూన్నదని వారన్నారు. నిరంతరం విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారనే కారణంగా ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలనే ఉద్దేశంతో పరిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకటరెడ్డి పై అక్రమంగా పూసపెల్లి కుట్ర కేసు నమోదు చేయడం చాలా దుర్మార్గమని, మొగిలి వెంకట్ రెడ్డి పై పెట్టిన పూసపల్లి కుట్ర కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో విద్యార్థులుగా, విద్యార్థి సంఘ నాయకులుగా సమాజంలో ఉన్న సబ్బండ వర్గాలను ఏకం చేసి రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నరు. ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే గొంతుకలపై ఉక్కు పాదం మోపాలనే ఉద్దేశంతో ఉన్న పాలకవర్గాలు వారి బుద్ధిని మార్చుకోవాలని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు యూనివర్సిటీ ఉపాధ్యాయులు రాజు, నాయకులు నరసింహ, రత్నాకర్, వెంకట్, అజిత్, నరసింహ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెంది ధాన్యం అమ్మకం చేయవద్దు

**చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**

**ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



ములుగు, మే 22 (తీన్మార్ న్యూస్): జిల్లాలో వరి ధాన్యం పండించిన రైతులు ఆందోళన చెంది తక్కువ ధరకు ధాన్యం అమ్మకం చేసుకోవద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) సి.హెచ్. మహేందర్ జి, ఆర్డిఓ సత్యపాల్ రెడ్డి లతో కలిసి కలెక్టరు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50వేల 175 ఎకరాలలో ఒక లక్ష 4,775 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండిస్తున్నారని, రైతుల నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడానికి ఇప్పటికే జిల్లాలో ఎఫ్సిఐ ద్వారా కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అకాల వర్షాల కారణంగా కొన్ని చోట్ల వరి ధాన్యం తడవగా ఆ ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారని అన్నారు. కొందరు రైతులు కంగారుపడి రైస్ మిల్లర్లకు తక్కువ ధరకే అమ్మకం చేసుకుంటున్నారని విషయం గ్రహించామని, రైతులు ఎవరు వరి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్మకం చేసుకోవద్దని సూచించారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాలోకి వరి ధాన్యం రాకుండా ఇప్పటికే వాజేడు మండలం వద్ద ప్రత్యేక చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని, రెండు ఫ్లయింగ్ స్కాడ్స్ నిత్యం పర్యటిస్తున్నారని మండల స్థాయిలో ఎమ్మార్వో ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఈ నెల 19న కురిసిన అకాల వర్షం కారణంగా 7000 మెట్రి క్ టన్నుల వరి ధాన్యం తడిసిందని, తడిసిన 7 వేల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. కొందరు వ్యక్తులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దని రైతులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు గురైన 9347416178 అనే హెల్ప్ లైన్ నెంబర్ కు ఫోన్ చేసి వివరించవచ్చని, హెల్ప్ లైన్ వారం రోజులలో 24 గంటల పాటు పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేయడానికి సంబంధిత అధికారులతో కృషి చేస్తున్నామని, మొలకెత్తిన వరి ధాన్యంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. విలేకరుల సమావేశంలో జిల్లా సివిల్ సప్లై మేనేజర్ బి. రాంపతి, డి సి ఓ సర్దార్ సింగ్, డి పి ఆర్ ఓ ఎండీ రఫిక్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**56వ బూత్ లో ఇంటింటి ప్రచారం**





పరకాల, మే 22 (తీన్మార్ న్యూస్): ఈనెల 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్ ఖమ్మం నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న పోటీ చేస్తున్న విషయం తెలిసిందే, ఆయనకు మద్దతుగా పరకాల పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని రెండోవార్డ్ 56వ బూత్ లో పట్టభద్రులైన గ్రాడ్యుయేట్స్ దగ్గరికి వెళ్లి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత (1)ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రశ్నించే గొంతుక నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే తత్వం ఉన్న ఒక వ్యక్తి తీన్మార్ మల్లన్న గత అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వ అరాచకాలను ఎండగడుతూ ప్రజల ముందు ఉంచి వివరించిన అతను ఒక జర్నలిస్టుగా పోరాడిన తీన్మార్ మల్లన్నను గుర్తించి కాంగ్రెస్ పార్టీ బరిలో దింపడం జరిగింది.ఆయనకు మద్దతుగా గ్రాడ్యుయేట్స్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, ఉమ్మడి పరకాల ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ పట్టణ నాయకులు బొచ్చు కట్టయ్య, బోచ్చు జితేందర్, ఒంటేరు సదానందం, జూపాక కిషన్, ఒంటేరు విజయ్, మంద శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను ఆరికడదాం

**జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ టేకుమట్ల సంధ్య**



ములుగు, మే 22 (తీన్మార్ న్యూస్): బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత తీసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ టేకుమట్ల సంధ్య అన్నారు.

బుధవారం ములుగు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామకృష్ణ అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక చట్టం పైన పంచాయితీ కార్యదర్శులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ బాల్య వివాహ చట్టం 2006 గురించి తెలియజేస్తూ బాల్య వివాహమునకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా సంబంధిత జిల్లా బాలల పరిరక్షణ విభాగం 1098 సిబ్బందికి సమాచారం అందించినట్లైతే అట్టి బాల్య వివాహం నిలిపివేయడం జరుగుతుందని, బాల్య వివాహము ఆపు చేసిన వారిని బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచి ఆ మైనర్ పిల్లల భవిష్యత్ పరంగా పిల్లలకు తగిన న్యాయం జరిగే విధంగా చూస్తామని తెలియజేశారు. అదే విధంగా జీవో ఎంఎస్ నెంబర్ 19 ప్రకారం అధికారులు ఎవరైనా ఉల్లంఘన చేసినట్లు అయితే వారికి శిక్ష తప్పనిసరి ఉంటుందని తెలియజేశారు, ఇప్పటివరకు ములుగు జిల్లాలో 150 పెళ్లిళ్ల వరకు ఆపడం జరిగిందని, పంచాయతీ సెక్రటరీస్ అందరూ సహకారంతోనే ఇది సాధ్యమైంది అన్నారు. ఇట్టి బాల్యవివాహాలతో పాటు ఇతర బాలల హక్కుల పరిరక్షణ కు సంబంధించిన ఉల్లంఘనలు ఏవి జరిగినా వాటిని అరికట్టడం, పిల్లలకు తగిన అత్యవసర సహాయం అందించే ఉద్దేశ్యంతోనే గ్రామాలలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఆయా గ్రామాలలో ఉన్న గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు తప్పనిసరిగా నెలవారీ సమావేశాలు నిర్వహించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని సూచించారు. దీనివల్ల గ్రామాలలో బాలలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఎదురైతే వాటికి తక్షణ పరిష్కారం చూపించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో రామకృష్ణ, మాట్లాడుతూ గ్రామ పరిధిలో ఎలాంటి బాలల సమస్యలు వచ్చినా మా శాఖ తరపున క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. తప్పకుండా గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేసే విధంగా చూద్దామని ప్రతినెల మీటింగ్ నిర్వహించుకుందామని ఈ విషయం లో అన్ని విధాలుగా సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో APO రాజు, డిసిపియు సోషల్ వర్కర్ సుమన్ మరియు అన్ని గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు మరియు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.




# మేడారంలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం ప్రత్యేక పూజలు

**- ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను మెజారిటీతో గెలిపించాలి**

**- అచ్చునూరి కిషన్ తీన్మార్ మల్లన్న రాష్ట్ర కమిటీ సభ్యులు**





తాడ్వాయి, మే 22 (తీన్మార్ న్యూస్): తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శనం చేసుకొని స్థానిక పట్టభద్రులందరిని కిషన్ ఆధ్వర్యంలో కలిసి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించగలరని తెలియజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో అవిశ్రాంతంగా కృషి చేసిన తీన్మార్ మల్లన్నకు పట్టం కట్టాలని, పెద్దల సభకు ఎంపిక చేయాలని పట్టభద్రులందరిని వేడుకుంటున్నాను. అలాగే ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటు'లో భాగంగా తీన్మార్ మల్లన్న పోరాటం అనేది వర్ణనాతీతం. కావున మేధావులారా, పట్టబద్రులారా మీరందరూ ఒకసారి ఆలోచించి మీ తరుపున నిలబడి, కలబడే ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకే మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారలమ్మ పూజారి కాక కిరణ్, తీన్మార్ మల్లన్న టీమ్ తాడ్వాయి మండల సభ్యులు రాసల సురేష్, సురేందర్ సింగ్, జాలిగపు జంపన్న, కాక రంజిత్, పోలబోయిన సురేష్, మహేష్, గజ్జెల రాజశేఖర్, చెర్ప రవీందర్, చెర్ప నేతాజీ, కడారి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



నేరేడుచర్ల, మే 22(తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కోటాచలం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు ఎక్కువగా జరిగేలా చూడాలని, ఎన్ సి డీ, టీ బీ మరియు అన్ని ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను అప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నాగిని, డాక్టర్ సౌమ్యశ్రీ, సాల్వాడి శ్రీనివాస్, సిఎచ్ ఓ త్రినాథ్, సీనియర్ అసిస్టెంట్ సూపెర్వైజర్ శ్యాంసుందర్ రెడ్డి, జయమ్మ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**- రూ.165000/- రూపాయలు అందజేసిన మిత్ర బృందం**



చిట్యాల, మే 22(తీన్మార్ న్యూస్): మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన పానుగుల్ల వెంకటేశం గౌడ్ ఈనెల 12న అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం కుటుంబ సభ్యులు నిర్వహించిన దశదినకర్మకు వెంకటేశంతో పాటు 1985-86 విద్యాసంవత్సరంలో గుండ్రాంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన తోటి మిత్రులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. పూర్వ విద్యార్థులంతా కలిసి సేకరించిన రూ. 1.65 లక్షల నగదును మృతుడి కుమారుడు శివకుమార్ కు ఆర్థిక సాయాన్ని అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొయగూర శ్రీనివాస్ (సన్నీ), కంచర్ల కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, తాటి ధనుంజయ, గోలి శ్రీనివాసులు, వీరమల్ల శ్రీనివాస్, గోపగోని అంజయ్య, శివశెట్టి సుదర్శన్, ఉప్పల అంజయ్య, కొండ శేఖర్ రెడ్డి ఫైళ్ల మల్లేశం, గరిషె వెంకటేశం, చెరుకుపల్లి నరేందర్, కొయగూర లింగస్వామి, మారగోని జంగయ్య, అండాలు, బెదరకోట యాదయ్య, కెఎల్ వీ. ప్రసాద్, బండమీది కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# శాసనమండలి ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**– జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి**



ములుగు, మే 22 (తీన్మార్ న్యూస్): వరంగల్– ఖమ్మం– నల్గొండ శాసనమండలి పట్టపద్రుల ఉప ఎన్నిక పోలింగ్ నిర్వహణలో భాగంగా కోసం ఎన్నికల సామాగ్రి పంపిణీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని సంబంధిత అధికారులను ఆదేశించారు. బుదవారం శాసనమండలి పోలింగ్ ప్రక్రియపై హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పి షభరిష్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి ల తో కలసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26న ఎన్నికల మెటీరియల్ పంపిణీ, 27న రిసెప్షన్ సెంటర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెటీరియల్ పంపిణీకి, స్వీకరణకు నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ 26, 27 తేదీల్లో సిబ్బందికి త్రాగునీరు, వైద్య శిభిరం, అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఎలాంటి లోటుపాట్లుకు తావు లేకుండా పక్కాగా, పకడ్బందీగా పోలింగ్ సామాగ్రి పంపిణీ చేయాలని, అలాగే 27న స్వీకరించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా పరిశీలన చేయాలని సంబందిత నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 26వ తేదీన మెటీరియల్ తీసుకున్న సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుని పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. పోలింగ్. ముగిసిన తదుపరి రిసెప్షన్ కేంద్రం నుండి పటిష్ఠ భద్రత, పోలీస్ ఎస్కార్ట్ తో నల్గొండ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి క్లోజ్డ్ వాహనంలో తరలించనున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు వస్తే తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో సత్యపాల్ రెడ్డి , జిల్లా నోడల్ అధికారులు , ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం కోసం భర్త ఇంటి ముందు భార్య వంటవార్పుతో నిరసన

**– బెదిరింపులకు గురి చేస్తూ తన భర్త చంపే ప్రయత్నం చేస్తున్నాడంటూ ఆరోపణ**



రాజాపేట, మే 22(తీన్మార్ న్యూస్): న్యాయం కోసం భర్త ఇంటి వద్ద వరకు నిరసన వ్యక్తం చేస్తున్న తనకు బెదిరింపులు అత్యాయత్నం పరిస్థితులు కనబడుతున్నాయని తనకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆప బోనని ఓ అబల తన ఆవేదనను వెలుబుచ్చింది. బుధవారం జరిగిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రాజపేట మండలం, బూరుగుపల్లి గ్రామంలో బుధవారం రేకులపల్లి పద్మారెడ్డి రెండవ కుమారుడు రేకులపల్లి మహిపాల్ రెడ్డి చిన్నం భాను అనే బీసీ కులానికి చెందిన మహిళను మూడు సంవత్సరాల క్రితం ప్రేమించి సింహాచలం ఆలయంలో పెళ్లి చేసుకున్నాడు. తన దగ్గర ఉన్న డబ్బులు 70 లక్షలు భర్త మహిపాల్ రెడ్డికి ఇచ్చినట్లు భాను తెలిపింది. 22 తులాల బంగారు గొలుసు కూడా ఇచ్చినట్లు తెలిపింది. మోత్కూర్ లో ప్లాటు తన భర్త మహిపాల్ రెడ్డి అమ్ముకున్నాడని, సంసారానికి పనికిరానని అంటున్నాడన్నారు. సంసారం చేస్తామని చెప్పినా పెద్ద మనుషుల సమక్షంలో 2022వ సంవత్సరం లో ఒప్పంద కాగితము తన భర్త రాసి ఇచ్చినాడన్నారు.





అప్పటినుండి ఇప్పటివరకు రావడం లేదని, ఇంటికి రావడం లేదని ఎక్కడున్నాడో సమాచారం తెలవదని తన ఫోన్ పనిచేయడం లేదని భాను తెలిపింది. అత్తగారి గ్రామమైన రాజపేట మండలం బూరుగుపల్లి గ్రామనికి ఏప్రిల్ నెలలో వచ్చానని, తన అత్త ఇంట్లోనే ఉండి వారితో కలిసిమెలసి ఉండాలని సమయంలో తనపై రౌడీలతో అత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు ఆరోపించింది. బూరుగుపల్లి గ్రామస్తుల సహకారంతో ప్రాణాపాయం నుండి తప్పించుకొని మరుసటి రోజు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపింది. తనకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరిగే లేదని ఆమె ఆరోపించింది. తనకు న్యాయం జరిగేంత వరకు నిరసన దీక్ష చేస్తానని ఆమె హెచ్చరించింది. ప్రాణాలు పోయిన ప్పటికీ తన న్యాయ పోరాటం ఆపబోనని తన భర్త మహిపాల్ రెడ్డితో కలసి సంసారం చేసేలా పోలీసులు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. అబల పోరాటానికి గ్రామస్తులు, పలువురు మద్దతు తెలిపారు.



# నా జీవితం అంధకారంలో ఉంది

- నాకు ఎవరైనా సహాయం చేయాలని అర్థిస్తున్నాను
- విలేఖరి బాబా (ముస్సపెట్)
- పక్షవాతంతో ఆరు నెలలగా కొనసాగుతున్న జీవితం
- కనీస వైద్యానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు
- దాతలు ముందుకు రావాలని అర్థనాదాలు
- మీరు చేసే చిన్న సహాయం నా వైద్యానికి పెద్ద మేలు ఇస్తుంది
- ప్రార్థించే పెదవుల కన్న సాయం చేసే చేతులు మిన్న అంటున్న విలేకరి



వనపర్తి ప్రతినిధి, మే 22(తీన్మార్ న్యూస్): జిల్లాలోని మూసాపేట్ మండలం, మూసాపేట్ గ్రామానికి చెందిన బాబ అను విలేకరి తాను గతంలో వివిధ పత్రికలలో పనిచేసి, ప్రస్తుతం యు–1చానల్ లో కొనసాగుతున్నారు. అయితే ఇతను గత ఆరు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నారని, తనకు గ్రామాల్లో సొంత ఇల్లు గానీ అమ్మానాన్న ఎవరు లేరని ఎలాంటి ఆస్తిపాస్తులు కూడా లేవని కనీస వైద్యానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులే మిన్న అన్నట్లుగా మీ సాయం నాకు చాలా అవసరమని దాతలు, మనసున్న మహానుభావులు ఎవరైనా ముందుకొచ్చి మీకు చేతనైన సాయం చేయగలరని కోరుతున్నానన్నారు. మీ సాయం నా వైద్యానికి ఉపయోగపడుతుందని ఆశిస్తున్నా అన్నారు. కనుక మీకు తోచిన సాయం 100, 200, 300, ఎంత తోచితే అంత ప్లీజ్ నా నెంబర్ “9848550569” కు చేయగలరని అర్థిస్తున్నానన్నారు. బుధవారం శివసేన యువసైన్యం వనపర్తి వాట్సాప్ గ్రూప్ లో బాబా పరిస్థితిని ఫార్వర్డ్ చేయగా గ్రూప్ సభ్యులు వారికి తోచినంత సహాయం అందించగా 3000 రూపాయలు అందాయి అని వారికి పేరు పేరు నా కృతజ్ఞతలు తెలియచేశారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం సాయం

**– అందజేసిన మంత్రాల సుమన్**

రాజాపేట, మే 22(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం, బేగంపేట గ్రామంలో మంత్రాల సుమన్ ఆధ్వర్యంలో బుధవారం ఇటీవల మరణించిన నీల మల్లమ్మ కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రాల సుమన్, గౌడ వినయ్, గడ్డమీది మహేష్, చిగుర్ల గణేష, దేవనపల్లి గణేష్, గౌడల్లి రాజేష్ కుమార్, ఇండ్ల స్వామి, నీల బాలయ్య, నీల కనకయ్య, పులి సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు



# గత ప్రభుత్వ జీఓల ప్రకారం చేపలు పట్టే హక్కు ముదిరాజ్ లకే చెందుతుంది

**మెపా రాష్ట్ర కమిటీ డిమాండ్**



హన్మకొండ, మే 22 (తీన్మార్ న్యూస్): ముదిరాజ్ లు ఇతర కులాల మధ్య వివాదం కారణంగా ఇటీవల హై కోర్ట్ ఒక కమిటీనీ ఏర్పాటు చేసి, ప్రభుత్వం ఈ వివాదం పరిష్కారం చేయాలని 3 నెలల కాలపరిమితి విధించింది. ఈ విషయ నేపథ్యంలో (మెపా) ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ బుధవారం నాడు హనుమకొండలోని కేంద్ర కార్యాలయంలో సమావేశం అయి చర్చించిన అనంతరం మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు 1964లో ఇచ్చిన జీఓ 98 ప్రకారం 29 తెగలు చేపలు పట్టకోవచ్చని అందులో ముదిరాజ్ లు కూడా ఉన్నారని అన్నారు. అసలు తెలంగాణలో అధిక జనాభా ఉన్న నిజమైన మత్స్యకారులు ముదిరాజ్ లే నని,బెస్త/ గంగ పుత్ర వారు కేవలం సముద్ర తీర ప్రాంతాల్లో నివసిస్తూ ఉండే వారు అని, అలాంటి వారు ముదిరాజ్ లు పండ్ల వ్యాపారులు అని, మత్స్యకారులు కారు అని కోర్ట్ కు వెళ్ళడం సమంజసం కాదని,ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బెస్త/గంగపుత్ర వాళ్ళు ఆంధ్ర లో విలీనం అయ్యారని, తెలంగాణ లో ఉన్న మత్స్యకార సంఘాల్లో 80 శాతం ముదిరాజ్ లే ఉన్నారని అన్నారు. 2021లో ఈ వివాదంపైన జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి, గత ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగింది. ఆ నివేదికలో ముదిరాజ్ లకు మత్స్యకార సంఘాల్లో సభ్యత్వం ఇవ్వాలని కమిటీ కూడా తీర్మానం చేసిందన్నారు. ప్రస్తుతం ఈ వివాదంపై ముదిరాజ్/ ముతిరాసి/తెనిగోల్ల తరుపున సీనియర్ న్యాయవాది డీఎల్ పాండు, బెస్త/గంగపుత్ర తెగల తరుపున న్యాయవాది విద్యావతిలు వాదనలు వినిపించగా ఇరువురి వాదనలు విన్న హై కోర్ట్ జస్టీస్ బీమపాక నగేష్ విచారణ జరిపిన అనంతరం ఈ వివాదాన్ని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తూ 3 నెలల్లోగా ఈ సమస్య పరిష్కారం కోసం కమిటీ వేసి నివేదిక ఇవ్వాలని కోర్ట్ ఆదేశించడం జరిగిందని అన్నారు. ఈ కమిటీలో ముదిరాజ్ సంఘాల నాయకులకు, మేధావులకు స్థానం కల్పించి, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని తుది నివేదిక ప్రభుత్వానికి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు నీరటి రాజు, పిట్టల రమేష్, కూతురు రాజు, సీనియర్ జర్నలిస్ట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌతమ్ కృష్ణ ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

వనపర్తి ప్రతినిధి, మే 22(తీన్మార్ న్యూస్): వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాల్లో బుధవారం వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి రథం ఏర్పాటు చేసేందుకు సహకరించిన గ్రామస్తులను ఆయన శాలువాలతో సత్కరించారు. భక్తులతో కలిసి ఎమ్మెల్యే స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘనపురం మండల సింగిల్ విండో డైరెక్టర్ కాంగ్రెస్ యువ నాయకులు సాయి చరణ్ రెడ్డి, గ్రామ నాయకులు నరేందర్ రెడ్డి, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




# ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు





భువనగిరి జిల్లా ప్రతినిధి, మే 22(తీన్మార్ న్యూస్): ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నట్లు తుర్కపల్లి మండల స్పెషల్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జినుకల శ్యాంసుందర్ అన్నారు. బుధవారం ఆయన మాదాపురం, మల్కాపూర్, కెసియ తండా, తుర్కపల్లి గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా అన్ని వసతి సౌకర్యాలు కల్పించుటకు అందులో భాగంగా పాఠశాలల్లో మంచినీటి వసతులు, మైనర్ రిపేర్, బాల బాలికలకు మూత్రశాలలు రిపేర్ చేయడం, విద్యుత్ సౌకర్యం కల్పించుచున్నట్లు తెలిపారు. ఇట్టి పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా ఈ పనులను నాణ్యతతో నెల చివరిలోగా పూర్తి చేయాలని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులను ఆదేశించారు. ఇట్టి పనులను ప్రతిరోజు గ్రామంలోని పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి పనుల పనుల ప్రగతి నివేదికను ప్రతిరోజు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీ లక్ష్మీబాయి, ఏఈ అమరేందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# బాలికపై అత్యాచారం చేసి పారిపోయిన ర్యాపిడో డ్రైవర్

**బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడు సందీప్ రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు**

సికింద్రాబాద్: ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనలో తుకారాం గేట్ పీఎస్ పరిధిలో నివాసం ఉండే బాలిక (16) నిరంతరం టెలి ఫోన్ లో మాట్లడుతుందడంతో ఇంట్లో వారు మందలించడంతో ఆదివారం ఇంట్లో నుండి పారిపోయింది. అదే సమయంలో పరిచయమైన ర్యాపిడో డ్రైవర్ సందీప్ రెడ్డి(28) బాలికకు మాయమాటలు చెప్పి తన బైక్ పైన తిప్పుకొని కచిగూడలోని ఒక లడ్జిలో రూమ్ తీసుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తరువాత అక్కడి నుండి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న బాలికను నిలదీయగా జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. వారు పోలీసులను ఆశ్రయించగా సీసీ ఫ్యూటేజిని పరిశీలించి నిందితుడు హబ్సిగూడ కు చెందిన ర్యాపిడో డ్రైవర్ సందీప్ రెడ్డి గా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# అంతక్రియలలో పాల్గొన్న సుదగాని హరి శంకర్ గౌడ్



ఆలేరు, మే 22(తీన్మార్ న్యూస్): ఆలేరు పట్టణ కేంద్రంలో 5వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అరుణ తండ్రి ఆలేటి ఎల్లయ్య అనారోగ్యంతో బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు సుదగాని హరిశంకర్ గౌడ్ వారి అంతక్రియలలో పాల్గొని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాలర్పించి, ఆయన మృతిపట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట బిఆర్ఎస్ పార్టీ పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ శ్రీ కటకం బాలరాజు, మరియు బిఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# మాకు పెన్షన్లు కావాలి

## హర్యానాలో బ్రహ్మచారుల సంఘం

ఛండీఘడ్: దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. 543 స్థానాలకు వేడి విడుదలు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఇప్పటికే నాలుగు దశల్లో పోలింగ్ పూర్తయింది. ఎన్నికల వేళ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు తమను గెలిపిస్తే అది ఇస్తాం.. ఇది ఇస్తామని హామీలు గుప్పిస్తున్నారు. ఇది సమయంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఓటు అనే ఆయుధాన్ని వాడుకుంటున్నారు. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. తాజా ఓ సంఘం కూడా తమ డిమాండ్లు నెరవేరిస్తేనే ఓటు వేస్తామని షరతు పెట్టింది. ఆ సంఘం ఏమిటి.. వాళ్ల డిమాండ్లు ఏమిటి అనే వివరాలు చూద్దాం ఎన్నికల వీరా హర్యానాలో బ్రహ్మచారుల సంఘం కీలక డిమాండ్లను తెరపైకి తెచ్చింది. రాష్ట్రంలో పెళ్లి కానీ అమ్మాయిలు అబ్బాయిలకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మచారులకు పెన్షన్ పథకాన్ని మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం ప్రకటించింది. ఏడాది క్రితం పథకం ప్రారంభించిన అమలు మాత్రం జరగడం లేదు. అర్హులను గుర్తించడంలో అలసత్వం వహిస్తున్నారు ఎన్నికల వేళ పథకం అమలు ప్రశ్నిస్తూ రాష్ట్రంలోని బ్రహ్మచారులు ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చారు. నోటి మాటగా హామీ ఇస్తే సరిపోదని లిఖితపూర్వకంగా హామీ కావాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో లోక్సభ ఎన్నికల్లో ఓటు వేయమని తేల్చి చెప్పారు.హర్యానాలో 45 దాటిన పెళ్లి కాని వారు 2022లో అవివాహిత పురుష సమాజం పేరుతో ఒక సంఘం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘంలో 7 లక్షల మంది సభ్యులుగా ఉండటం గమనార్హం. ఈ సంఘాన్ని దృష్టిలో పెట్టుకొని గత ఏడాది హర్యానా ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్.. రాష్ట్రంలో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. 45 నుంచి 60 ఏళ్ల వయసు ఉన్న పెళ్లి కాని స్త్రీ, పురుషులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. హర్యానాలో ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే బ్రహ్మచారులు ఎక్కువ. రాష్ట్రంలో స్త్రీ పురుష నిష్పత్తి లో చాలా వ్యత్యాసం ఉంది. మరోవైపు యువకులకు ఉద్యోగాలు దొరకడం లేదు. దీంతో అమ్మాయిలు ఉన్న తల్లిదండ్రులు ఉద్యోగం ఉన్న అబ్బాయిలకే తమ కూతురుని ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. దీంతో చాలామంది పెళ్లి కాకుండానే మిగిలిపోతున్నారు. ఈ క్రమంలో 45 నుంచి 60 వీళ్ళ మధ్య వయసు ఉన్న బ్రహ్మచారులకు పెన్షన్ ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ. 2,750 పెన్షన్ ఖరారు చేసింది. పెన్షన్ పథకం ప్రకటించి ఏడాది దాటిన దాన్ని సరిగా అమలు చేయడం లేదని అవివాహిత పురుషులు ఆరోపిస్తున్నారు. కొంతమందికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నారని పేర్కొంటున్నారు. తమను సమాజం చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సభ్యులందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అందుకే ఎన్నికల వేళ ఈ డిమాండ్ ను తెరపైకి తెచ్చారు.

# 1104 ఆద్వర్యంలో ఘనంగా మే డే ఉత్సవాలు




రామన్నపేట, మే 22(తీన్మార్ న్యూస్): తెలంగాణా స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆద్వర్యంలో మే డే ఉత్సవాలను రామన్నపేట సబ్ డివిజన్ లో బుధవారం ఘనంగా నిర్వచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, జిల్లా సెక్రెటరీ అమర్నాథ్ లు ముఖ్య అతిదులుగా పాల్గొని మాట్లాడుతుగా ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 1104 యునియన్ నిరంతరం కృషి చేస్తున్నదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియాన్ చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షులు అల్లె రమేష్, చౌటుప్పల్ డివిజన్ సెక్రెటరీ సోమేశ్వర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, అడిషనల్ సెక్రటరీ అశోక్, జాయింట్ సెక్రటరీ యాదయ్య, జిల్లా అదనపు కార్యదర్శి తిరుమలయ్య, డిస్కం లీడర్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, భువనగిరి డివిజన్ అధ్యక్షలు షకీల్ బేగ్, రామన్నపేట సబ్ డివిజన్ లీడర్ మల్లయ్య, రామన్నపేట సెకన్ లీడర్ వేణు, వలిగొండ సెక్షన్ లీడర్ రాములు, జాకీర్ హుస్సేన్, మదార్, క్రిష్ణ, శ్రీను, ప్రభాకర్, సురేష్, నరసింహ మహేష్, సైదులు, గోపాల్, రవీందర్, సత్యనారాయణ, స్వామి, వెంకన్న, హరిబాబు, యాదయ్య, దేవేందర్, క్రిష్ణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల చదువులకు ఆర్ధిక సహాయం అందజేత

రామన్నపేట, మే 22(తీన్మార్ న్యూస్): మండలంలోని నీర్నెముల గ్రామనికి చెందిన చిప్పలపల్లి మధు ఇటివల కాలంలో మరణించ గా తన కుటుంబ పరిస్థితిని తెలుసుకొని నోముల కుమార్ అనే వ్యాపార వేత్త వారి పిల్లల చదువు దృష్టిలో పెట్టుకొని తన వంతుగా రూ. 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ముందు భవిష్యత్తు లో కూడా వారి పిల్లల చదువు కోసం తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందనీ కుటుంబానికి హామీ ఇచ్చారు.



# 8,9 తేదీలలో చేపమందు

హైదరాబాద్: ఈ ఏడాది చేప ప్రసాదం పంపిణీపై బత్తిని కుటుంబ సభ్యులు కీలక ప్రకటన చేశారు. జూన్ 8న శనివారం ఉదయం 11 గంటలకు మృగశిర కార్తె ప్రవేశిస్తుందని.. ఆ రోజునే చేప ప్రసాదం పంపిణీ చేస్తామని బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జూన్ 8న ఉదయం 11 గంటల నుంచి జూన్ 9న ఉదయం 11 గంటల వరకూ పంపిణీ ఉంటుందని చెప్పారు. చేప ప్రసాదం కోసం వచ్చే వారి కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆస్తమా, ఉబ్బసం, దగ్గు వంటి శ్వాస సంబంధిత వ్యాధుల నివారణకు ఏటా దీన్ని పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో బత్తిని అమర్నాథ్ గౌడ్, ఇతర కుటుంబ సభ్యులు, శివశంకర్ గౌడ్, గౌరీశంకర గౌడ్, శివశేఖర్ గౌడ్, సంతోష గౌడ్, మౌళి గౌడ్, రోషన్ గౌడ్ పాల్గొన్నారు.దాదాపు రెండు శతాబ్దాలుగా తమ కుటుంబం చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు తెలిపారు. 'ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు మృగశిరా కార్తె ప్రవేశించిన ఘడియ ల్లో ఓ పదార్థాన్ని చేప ద్వారా రోగి నోట్లో వేస్తాం. ఈ ప్రసాదాన్ని వ్యాధి తీవ్రతను బట్టి రోగి నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు తీసుకుంటే పూర్తిగా నయం అవుతుంది. ఈ సేవ మా కుటుంబ పెద్దలకు 190 ఏళ్ల క్రితం ఓ మునీశ్వరుడు బోధించారు. అప్పటి నుంచి నిస్వార్థంగా ఉచితంగా లక్షలాది మంది శ్వాస సంబంధిత రోగులకు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నాం. ఇప్పటివరకూ గత ప్రభుత్వాలన్నీ పూర్తి సహకారాన్ని అందిస్తూ అన్ని ప్రభుత్వ శాఖలు బాధ్యతగా ఏర్పాట్లు చేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాని కోరాం.చేప ప్రసాదం పంపిణీకి ఎప్పటిలాగానే ఆర్టీసీ, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపాలిటీ, పోలీస్ శాఖలతో పాటు మత్స్య శాఖను కావాల్సిన చేపల్ని సిద్ధం చేయాల్సిందిగా లిఖిత పూర్వకంగా సంప్రదించాం' అని బత్తిని అమర్నాథ్ గౌడ్ తెలిపారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ చేప ప్రసాదం ఎవరైనా తీసుకోవచ్చని.. గర్భిణీలు మాత్రమే తీసు కోవద్దని బత్తిని కుటుంబ సభ్యులు సూచించారు. పరగడుపున లేదా భోజనం తీసుకున్న 3 గంటల తర్వాత చేప ప్రసాదం తీసుకోవాలని అన్నారు. వేలాదిగా తరలివచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంపిణీ సజావుగా సాగడానికి ప్రభుత్వంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకొస్తు న్నాయి. రోగులకు భోజనం, కాఫీ, టీ, టిఫిన్, మజ్జిగ, మంచినీరు అందిస్తామని అగ్రవాల్ సేవా దళ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చెప్పారు. క్యూ లైన్ లో రోగులు ఏ విధంగా ఇబ్బంది పడకుండా వాలంటీర్లు సేవలందిస్తారని చెప్పారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో పంపిణీ రోజున దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేక క్యూలైన్లు కౌంటర్లు ఉంటాయని తెలిపారు.

# సెప్టెంబర్ 15 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

హైదరాబాద్, మే 22: తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూలు మే నెలాఖరు లేదా జూన్ మొదటివారంలో వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు) జారీ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నాటికి ఇంజినీరింగ్ మొదటి సంవత్సర తరగతులు ప్రారంభించాలని కళాశాలలకు ఏఐసీటీఈ స్పష్టం చేసిన నేపథ్యంలో.. గడువులోపు ప్రవేశాలు పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అదేవిధంగా యాజమాన్య(మేనేజ్‌మెంట్) కోటా సీట్లను ఇష్టారీతిన అమ్ముకోకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో మేనేజ్‌మెంట్ కోటా సీట్లను భర్తీచేసే అవకాశం ఉంది. ఎంబీబీఎస్ సీట్ల మాదిరిగా మూడు (ం, ః, అ) కేటగిరీలుగా విభజించి ఫీజులు నిర్ణయించడం లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై సమాలోచనలు చేస్తున్నారు.

**ఆ విద్యార్థులకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్..**

మరోవైపు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలలో డిప్లొమా చదివి లేటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బీటెక్ లేదా బీఫార్మసీ రెండో ఏడాదిలో చేరే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేలా చూస్తామని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఎప్‌సెట్ ఫలితాల వెల్లడి సందర్భంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు కు కొత్తగా ఎలాంటి దరఖాస్తులు ఆహ్వానించలేదని, అయినా కొందరు దరఖాస్తులు ఇస్తున్నారని, నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తామని తెలిపారు. గతేడాది అనుమతులు లేకుండా ప్రవేశాలు నిర్వహించిన రెండు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులను ఇతర విద్యాసంస్థల్లో సర్దుబాటు చేశామని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి తెలిపారు.

**మేనేజ్‌మెంట్ కోటాలోనూ కంప్యూటర్‌దే హవా..**

యాజమాన్య కోటాలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుకే అధిక డిమాండ్ ఉంది. కోర్ గ్రూప్‌లైనా సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపడంలేదని విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంటేశం అన్నారు. ఇంజినీరింగ్ కోర్ గ్రూపుల్లో సీట్లు బాగానే మిగిలిపోతున్నాయని, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఎమర్జింగ్ కోర్సులు ఉన్నాయని, వాటిలోనూ విద్యార్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు.

**కొత్తగా ప్రైవేటు వర్సిటీలకు అనుమతి..**

రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వడానికి ప్రభుత్వం ఆలోచన చేస్తోందని విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తూ, నాణ్యమైన విద్యను అందించడానికి ముందుకొచ్చే ప్రైవేటు యూనివర్సిటీలకే ఏర్పాటుకు అనుమతిస్తామన్నారు. ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు కొందరు ముందుకొస్తున్నారని, వారిని పరిగణలోకి తీసుకొంటామని ఆయన పేర్కొన్నారు.

**ఉమ్మడి ప్రవేశాలే..**

ఎప్‌సెట్ ద్వారా ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మా కళాశాలల్లో తెలంగాణ, ఏపీ విద్యార్థులకు ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి ప్రవేశ విధానాన్నే అమలుచేయనున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. జూన్ 2లోపే ఎప్‌సెట్ ఫలితాలు విడుదలైనందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీఎప్ ఎప్‌సెట్-2024 పరీక్ష ఫలితాలు మే 18న విడుదలైన సంగతి తెలిసిందే. ఎప్‌సెట్ ఫలితాలకు సంబంధించి అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 89.66 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇందులో అమ్మాయిలో 90.18 శాతం, అబ్బాయిలు 88.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 74.98 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఇందులో అమ్మాయిలు 75.85 శాతం, అబ్బాయిలు 74.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 91,633 మంది విద్యార్థులు హాజరు కాగా, 82,163 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో 2,40,618 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,80,424 మంది ఉత్తీర్ణత సాధించారు.

# ఆ ముగ్గురు కమలం నేతలే...

వరంగల్: రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల సమరం వేడి చల్లారక ముందే రాష్ట్ర రాజకీయాలను ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వేడెక్కిస్తోంది. ఈ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, భారతీయ జనతా పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అక్కడ పోటీ చేసిన ప్రధాన పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులు ముగ్గురూ.. బీజేపీ వాళ్ళే. ఒకే పార్టీ నుండి ముగ్గురు అభ్యర్థులు ఎందుకు పోటీ చేస్తారనేదే. కదా మీ అనుమానం..? ఒకరు బీజేపీ నుండి పోటీ చేయగా, ఇద్దరూ గతంలో బీజేపీలో పనిచేసిన నేతలే ఇప్పుడు పోటీ పడుతున్నారు. జంపింగ్‌లతో వరంగల్ ? ఖమ్మం ? నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారింది.లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడక ముందే వరంగల్ ? ఖమ్మం ? నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. 2021లో ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. అయితే గతేడాది డిసెంబర్ లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలిచారు. దీంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవి కాలం మార్చి 2027 వరకు ఉంది. ఈ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నిక పోరు ఆసక్తికరంగా మారింది.వరంగల్ ? ఖమ్మం ? నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులతో సహా 52 మంది పోటీ పడుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నిక మూడు ప్రధాన పార్టీలకూ ప్రతిష్టాత్మకంగా మారింది. సిట్టింగ్ సీటును నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతుండగా, ఈసారి ఎలాగైనా పాగా వేయాలనే కాంగ్రెస్ పట్టుదలతో వ్యవహరిస్తోంది. గత ఎన్నికల్లోనూ బలమైన ఓట్లు సాధించడమే కాకుండా విద్యావంతుల ఆదరణ తమకే ఉందని నిరూపించే సంకల్పంతో బీజేపీ ఈ స్థానంపై కన్నేసింది. ఇక్కడి కాంగ్రెస్ నుండి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నుండి ఏనుగుల రాకేష్ రెడ్డి బరిలో ఉన్నారు.

మూడు ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల విషయంలో ఒక విశేషం ఉంది.ఈ ముగ్గురు అభ్యర్థులు ఒకప్పుడు భారతీయ జనతా పార్టీలో పాత కాపులే కావడం ఆసక్తికరంగా ఉంది. రాజకీయ అవకాశాల కోసం బీజేపీ నుంచి ఇతర పార్టీలోకి జంపింగ్ చేసిన నేతలు ఇప్పుడు పోటీ పడుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ప్రేమేందర్ రెడ్డి మొదటి నుంచి పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ వచ్చారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2021లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రేమందర్ రెడ్డి పోటీ చేసి ఓటమి చవిచూశారు. మరోసారి ఆయన తన అదృష్టం పరీక్షించుకుంటున్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న కూడా ఒకప్పుడు బీజేపీ నేతగా ఉన్నారు. ప్రజల గొంతుకగా ఉంటానంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శల దాడి చేసిన తీన్మార్ మల్లన్న.. బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా బీజేపీయే అంటూ కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. కొద్ది రోజులకే బీజేపీలో సరైన అవకాశాలు, ప్రాధాన్యత లేదని భావించిన మల్లన్న కాంగ్రెస్ లోకి జంప్ చేసి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్సీ బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తీన్మార్ మల్లన్న రెండో స్థానంలో నిలిచారు. దీంతో ఈ స్థానంలో ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్న పార్టీ అభ్యర్థిగా బరిలోకి దించింది.బీఆర్ఎస్ నుండి పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్ రెడ్డి కూడా గతంలో బీజేపీ నేతనే కావడం విశేషం. రాకేష్ రెడ్డి బీజేపీలో విద్యార్థి నేతగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, అంచలంచెలుగా ఎదిగి పార్టీ అధికార ప్రతినిధిగా కూడా వ్యవహరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఆశించి భంగపడిన రాకేష్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరారు. సిట్టింగ్ స్థానం కావడంతో దీన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ బలమైన విద్యార్థి నేతగా పేరున్న రాకేష్‌రెడ్డిని పోటీలో నిలిపింది. సోషల్‌మీడియా, మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం సాగించి పట్టభద్రుల్లో పట్టు సాధించాలని మూడు ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి.మూడు పార్టీలు బలమైన అభ్యర్థులను పోటీకి నిలపడం ద్వారా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోరు రసవత్తరంగా సాగుతోంది. ఒకప్పటి పార్టీ పాతకాపులే జంపింగ్ చేసి ప్రధాన పార్టీ అభ్యర్థులుగా పోటీ పడుతుండడంతో ఇక్కడి ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారింది

# బీఆర్ఎస్ కు మనుగడ లేదు

## ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

## ఈటల రాజేందర్

ఖమ్మం: నగరంలోని శ్రీశ్రీ హోటల్లో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ హాజరయ్యారు. అయనను పార్టీ నేతలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాంద్ర వినోద్ రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈటల మాట్లాడుతూ 2 7 వ తేదీన ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. బీజేపీ అభ్యర్థిగా 40 ఏళ్లుగా సిద్ధాంతాన్ని నమ్ముకుని ఎత్తిన జెండా దింపని గుజ్జుల ప్రేమెందర్ రెడ్డి నీ దింపాం. ఆర్టీసీ ఉద్యోగులు తమని నాడే ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించిన నేటికీ అమలు చేయకపోవడం పట్ల వారు బాధతో ఉన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలు చెల్లింపు విధానంతో మళ్ళీ ఆర్టీసీ నీ దివాల తీసే ప్రయత్నం చేస్తున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లు నిరుద్యోగ యువతకు 4 వేలు ఇస్తా అని హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఇవ్వలేదు. ఓట్లు అడిగేముందు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 4 డీఏ లు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి. ఉద్యోగులను అరచేతిలో బెల్లం పెట్టి మోచేతి వరకు ప్రభుత్వం నాకించారు. ఉద్యోగులకు ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించాలని అన్నారు. ఈహెచ్ఎస్ కింద ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. మంత్రులు స్కూల్, కాలేజీ యాజమాన్యాలతో సమావేశాలు పెట్టి ఓట్లు వేయాలని బలవంతం చేస్తున్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు.ఎన్నికల సమయం లో మీకు అండగా ఉన్నవారికి జీతాలు ఇవ్వకుండా ఉండటం సమం జసం కాదు. జీవో నెంబర్ 317 విషయంలో కేసిఆర్‌ను తప్పు పట్టాం, నేడు ఉద్యోగుల మీద లాఠీ ఛార్జ్ చేసే పరిస్థితి వుంది. ఈ ప్రభుత్వం అతి కొద్ది కాలంలో ప్రజలతో ఛీ కొట్టించుకున్న ప్రభు త్వం. సీఎం రేవంత్ రెడ్డి ఏమి మాట్లాడతాడో ఆయనకే తెలియదు. ప్రతి నెలకు ప్రతి మహిళకు 8 వేల భృతి ఇస్తా అని కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చింది. చట్టసభలు నిలదీస్తే బీజేపీ నే, నేడు తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి మనుగడ లేదు. రాష్ట్రంలో ఉన్న ఏ సమస్యపై అయిన కొట్లాడే పార్టీ బీజేపీ. అందుకు బీజేపీ ఎమ్మెల్సి అభ్యర్థి గుజ్జుల ప్రేమెందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించండని అన్నారు.

# గిరిజన గురుకుల కళాశాలలో సీట్లు పెంచాలి

అరకులోయ: అల్లూరి సీతారామ రాజు జిల్లాలో పాడేరు ఏజెన్సీ పరిధిలో గిరిజన గురుకుల కళాశాలలో 21.22 తేది బాలురు, బాలికలు కౌన్సెలింగ్ పాడేరు స్థానిక బాలికల గురుకుల కళాశాలలో జరుగుతున్నాయి. అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ కె రాజశేఖర్ బృందం వెళ్లి సందర్శించి, ఉపాధ్యాయులతో విద్యార్థులతో, మాట్లాడుతూ కౌన్సెలింగ్ ఎలా జరుగుతుందని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె రాజశేఖర్ మాట్లాడుతూ ఎంతో మంది గిరిజన పేద విద్యార్థులు ఆర్థిక స్థోమత లేక గురుకుల కళాశాలలో దరఖాస్తులు పెట్టుకుంటున్నార న్నారు. ఐటిడిఎ అధికారులు గ్రూపుకు 40 సీట్లు మాత్రమే కేటాయించి, విద్యార్థిని, విద్యార్థులకు నిరాశ కలిగిస్తున్నారన్నారు. ప్రభుత్వం, ఐటిడిఎ పిఓ , గురుకుల ప్రిన్సిపాల్ సెక్రటరీ వెంటనే స్పందించి ప్రతి మండలం లో గురుకుల కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు, ప్రతి గ్రూప్ కు 60 నుంచి 80 సీట్లు పెంచి విద్యార్థిని, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు.

# మురికి కంపుతో విరాజిల్లుతున్న ఎంఎంటీఎస్ స్టేషన్

హైదరాబాద్: ఎంతో పచ్చదనం, పారిశుద్ధ్యం నిర్వహణతో కళకళలాడాల్సిన బోరబండ రైల్వే స్టేషన్ పరిసరాలు మురికి కంపు వెదజల్లుతూ ప్రయాణికులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ నుండి నిత్యం వందల సంఖ్యలో ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కానీ రైల్వే స్టేషన్ కు చేరుకోవాలంటే చెత్త కుప్పల మీద నడిచి వెళ్లాల్సిన దుస్థితి నేడు నెలకొంది. ఒకప్పుడు బోరబండ రైల్వే స్టేషన్ వరకు బస్సు సౌకర్యం ఉండేది. అది కాస్త బంద్ కావడంతో ప్రయాణికుల కోసం వేసిన షెల్టర్లు సైతం పాడైపోయాయి. అల్లాపూర్ డివిజన్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో మచ్చుకైన పరిసరాలు పరిశుభ్రంగా లేవు. స్థానిక ప్రజలు ఈ ప్రాంతంలో పెద్ద మొత్తంలో చెత్తను పడేయడంతో పాటు, కొంతమంది చిరు వ్యాపారుల సైతం వారి వద్ద వెలువడే చెత్తను తీసుకొచ్చి ఈ ప్రాంతంలో పడి వేయడంతో పరిసరాలు పూర్తిగా దుర్గంధ మయం అయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి ఎంఎంటివిఎస్ లో ప్రయాణించే వారి సౌకర్యార్థం చెత్తకుప్పలను తరలించడంతోపాటు దీనికోసం ఒక శాశ్వత పరిష్కారం మార్గాన్ని చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ప్రజల వాహనదారుల రక్షణే ప్రధాన ధ్యేయం

**ఫైన్లు వేయడం జరిమానా విధించడం మా అభిమతంకాదు**

**పోలీస్ కమిషనర్ డాక్టర్. బి. అనురాధ**

సిద్దిపేట: మైనర్ డ్రైవింగ్ చేసిన వ్యక్తులపై 509 కేసులు, నమోదు చేయడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైరన్ లు అమర్చితే చర్యలు తప్పవు. జిల్లాలో ట్రిబుల్ రైడింగ్ , మైనర్ డ్రైవింగ్, డబుల్ సైలెన్సర్ల పై స్పెషల్ డ్రైవ్, పట్టుబడితే చర్యలు తప్పవు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో మైనర్ డ్రైవింగ్, ట్రిబుల్ డ్రైవింగ్, నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్ లు,అధిక శబ్దాలు వచ్చేలా వాహనాలకు సైలెన్సర్లు బిగించే వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత కొన్ని రోజుల వ్యవధిలో జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైరన్లు బిగించిన 30 వాహనలపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయడం జరిగిందని, ట్రిబుల్ రైడింగ్ చేసే వారిపై 305, మందికి జరిమానా విధించి కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. మైనర్ డ్రైవింగ్ చేసే వారిపై 509 కేసులు నమోదు, నమోదు చేసి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. పిల్లలను రక్షించుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉంటుందని తల్లిదండ్రులు గమనించాలి. పిల్లలు ఏది అడిగితే అది కొనివ్వవద్దని ముఖ్యంగా వాహనాల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. సరదాకు వాహనాలు నడిపి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నవారు ఉన్నారని పుత్ర సోకానికి గురికా వద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇచ్చి వారిని ప్రోత్సహించడం వల్ల వారు తెలిసి తెలియని డ్రైవింగ్ వల్ల ప్రమాధాలకి కారణం అవుతున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి పట్టుబడిన వారి తల్లిదండ్రులు,వాహనాల యజమానుల పై కేసులు నమోదు చేయడం జరుగుతుదని హెచ్చరించారు. జిల్లాలో నిబంధనలు విరుద్ధంగా వాహనాలకు సైరన్లు బిగిస్తే వాహనాలు సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నెల రోజుల వ్యవధిలో జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా సైరన్లు బిగించిన 30, వాహనాలపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేయడం జరిగిందన్నారు. సైరన్లు తీపించి చట్ట ప్రకారం ఉండవలసిన సైలెన్సర్లను బాధితులతో బిగింప చేయడం జరిగింది.జిల్లాలో సైలెన్సర్ లను తీసివేసి శబ్ద కాలుష్యం చేసే వాహనాలపై , అధిక వేగంతో ట్రిబుల్ రైడింగ్ చేస్తూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్న వాహనాలను సీజ్ చేయడంతో పాటుగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.ఈ మధ్యకాలంలో కొంతమంది సిద్దిపేట పట్టణ శివారు ప్రాంతంలో రంగనాయక సాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో బైక్ రైడింగ్ నిర్వహిస్తున్నారని తెలిసింది, వారిపై సీసీ కెమెరాలు ద్వారా ప్రత్యేక నిగా ఏర్పాటు చేయడం జరిగింది. అట్టి వాహనదారులను పట్టుకొని చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్య తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు బిగించుకున్న వాహనాలు కనబడితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలి సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. సిద్దిపేట, గజ్వేల్, పట్టణంలో సంబంధిత ట్రాఫిక్ పోలీస్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# ఏసీపీపై ఏసీబీ

హైదరాబాద్, మే 22: సీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావు ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అశోక్‌నగర్‌లోని ఆయన ఇంటితో పాటు ఏకకాలంలో 10 చోట్ల దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లో 6 చోట్ల, ఇతర ప్రాంతాల్లో 4 చోట్ల దాడులు చేశారు. ఉదయం 5 గంటల నుంచి ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ ఏసీబీ ఏకకాలంలో దాడులు చేసింది. ఆయనకు ఉన్న స్థిర, చర ఆస్తులు, అప్పులు వివరాలను ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు. అలాగే సర్వీసు రికార్డు, ఆర్థిక లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు. ప్రస్తుతం ఉమామహేశ్వరరావు సాహితీ ఇన్‌ఫ్రా కేసుల విచారణ అధికారిగా ఉన్నారు. గతంలో ఆయన ఇబ్రహీంపట్నం ఏసీపీగా పనిచేశారు. ఇబ్రహీంపట్నం రియల్ మర్డర్ కేసులో ఉమా మహేశ్వరరావు సస్పెండయిన సంగతి తెలిసిందే. డబుల్ మార్డర్ నిందితుడు మట్టారెడ్డి నుంచి ముడుపులు తీసుకున్నాడని ఉమామహేశ్వరరావుపై అభియోగాలు ఉన్నాయి.

**రాజన్న జిల్లాలో పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్**

మరో పక్క తెలంగాణలో అవినీతి అధికారుల భరతం పడుతోంది ఏసీబీ. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న జోగినపల్లి భాస్కర్ రావు రూ. ఏడు వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వెంకటేష్ బిల్లుల మంజూరు కోసం రూ.ఎనిమిది వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో వెంకటేష్ ఏసీబీని సంప్రదించారు. సోమవారం ఏడు వేల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా భాస్కర్ రావును అదుపులోకి తీసకున్నట్లు డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు.

**పట్టుబడిన తహసీల్దార్**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల తాహసీల్దార్ మాధవి ఏసీబీకి చిక్కారు. ధరణి ఆపరేటర్ ద్వారా ఓ రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నూరు గ్రామానికి చెందిన గోపాల్ మే 9న మీసేవలో విరాసత్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ క్రమంలో గోపాల్ నుంచి రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశారు. తహసీల్దార్ మాధవితోపాటు ధరణి ఆపరేటర్ రాకేశ్ రూ.5 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించాడు. పక్కా ప్లాన్ ప్రకారం రంగంలోకి దిగిన అధికారులు ఎమ్మార్వో మాధవి రూ. 5 వేలు, ధరణి ఆపరేటర్ రూ.1000 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

**విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు లంచం**

నల్గొండ జిల్లా చింతపల్లిలో రైతు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఓ విద్యుత్ ఉద్యోగి ఏసీబీకి చిక్కాడు. చింతపల్లిలో విద్యుత్‌శాఖ ఉద్యోగిగా వేణు పనిచేస్తున్నాడు. బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు సూర్యనారాయణ అనే రైతును రూ.50 వేల లంచం అడిగాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో పథకం ప్రకారం రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వేణును పట్టుకున్నారు. భద్రాద్రిలో రైతు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏఈ శరత్ కుమార్ ఏసీబీకి చిక్కాడు. వ్యవసాయ క్షేత్రానికి ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చేందుకు కొనకళ్ల ఆదిత్య అనే రైతును లంచం అడిగాడు శరత్‌కుమార్. ఈ క్రమంలో బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులకు శరత్‌కుమార్ లంచం తీసుకుంటూ దొరికిపోయాడు. అనంతరం అశ్వారావుపేట సబ్ స్టేషన్‌లోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

# లేటెస్ట్ టెక్నాలజీ ప్రభావంపై జెఫ్రీ హింటన్ హెచ్చరిక

**– ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయి**

**– మానవాళి విధ్వంసానికి ఏఐ దారితీస్తుంది**

న్యూ డిల్లీ మే 22: మరికొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఏఐ గాడ్‌ఫాదర్లలో ఒకరిగా చెబుతున్న జెఫ్రీ హింటన్ గత ఏడాదిగా లేటెస్ట్ టెక్నాలజీ ప్రభావంపై హెచ్చరిస్తున్నారు. ఏఐతో పొంచిఉన్న ముప్పుపై హింటన్ ఇటీవల మరోసారి తన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని హెచ్చరించింది. 2022లో చాట్‌జీపీటీ లాంఛ్ అనంతరం ఇంటరాక్టివ్ ఏఐ చాట్‌బాట్స్‌పై టెక్ ప్రపంచంలో హాట్ డిబేట్ సాగింది. చాట్‌జీపీటీకి విశేష ఆదరణ లభించడంతో ప్రమోటింగ్ కంపెనీ ఓపెన్‌ఏఐ, కంపెనీ సీఈవో సాం ఆల్ట్‌మాన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఆపై చాట్‌జీపీటీ ప్రాచుర్యం పొందడంతో పలు టెక్ దిగ్గజ కంపెనీలు తమ సొంత చాట్‌బాట్‌లను లాంఛ్ చేశాయి. ఇక ఏఐతో నూతన అవకాశాలు ముందుకొస్తాయని, మానవులకు తమ దైనందిన జీవితంలో ఏఐ సాయపడుతుందని కొందరు నిపుణులు చెబుతున్నారు. ఏఐతో మనుషులు చేసే ఉద్యోగాలు కనుమరుగవుతాయని, దీనిపైనే తాను కలత చెందుతున్నానని ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన చెప్పుకొచ్చారు. అయితే నూతన టెక్నాలజీ ఉత్పాదకతను పెంచి సంపదను సృష్టించినా అది తిరిగి సంపన్నుల చేతికి చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఏఐతో ప్రపంచానికి మేలు చేకూరి సంపదను సమకూర్చినా అది ఈ టెక్నాలజీతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి, సామాన్యులకు చెందకుండా కేవలం డబ్బున వారి చేతుల్లోకే వెళుతుందని, ఇది సమాజానికి చేటు చేస్తుందని చెప్పారు. ప్రజలకు కనీస రాబడిని ప్రభుత్వం సమకూరిస్తే ఏఐ కారణంగా వారు ఇబ్బందులకు లోనుకాకుండా చూడవచ్చని హింటన్ సూచించారు. తనను సంప్రదించిన అధికారులు, పాలక వర్గాలకు తాను ప్రజలకు కనీస ఆదాయ పథకం గురించి ప్రతిపాదించానని, ఇది సరైన ఆలోచన అని వారికి చెప్పానని హింటన్ వివరించారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**పంచాయితీ పెద్దగా రేవంత్**



హైదరాబాద్: మాజీ మంత్రి మల్లారెడ్డి.. కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి మధ్య భూపంచాది సంచనంగా మారింది. మల్లారెడ్డి ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డి.. అడ్లూరి అనుచరులు సుచిత్రలోని సర్వేనెంబర్ 82కు సంబంధించిన భూమిలో ఘర్షణకు దిగడం రాజకీయంగా హాట్ టాపిక్ అయింది. ఈ భూమి తమదంటే తమదని రెండు వర్గాలు మీడియా వేదికగా ప్రెస్ మీట్ లు పెట్టి రచ్చ రచ్చ చేసేశాయ్. ఈ భూమిని తాను 2015 లోనే కొనుగోలు చేసి కబ్జాలో ఉన్నట్లు మల్లారెడ్డి చెబుతుండగా.. అడ్లూరు మాత్రం తాను మరి కొంతమంది పార్ట్నర్స్ తో కలిసి కొనుగోలు చేసిన ఈ ల్యాండ్ ను మల్లారెడ్డి హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి కబ్జా పెట్టేశారని ఆరోపించారు. మరోవైపు మల్లారెడ్డి మాత్రం ఈ భూమి తనది కాదని నిరూపిస్తే..తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ కూడా విసిరారు.అయితే అడ్లూరి అధికార పార్టీ ఎమ్మెల్యే కావడం..మాజీ మంత్రి మల్లారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోరడంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తికరంగా మారింది. మల్లారెడ్డికి సోమవారం సీఎం రేవంత్ అపాయింట్మెంట్ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సుచిత్రలోని తన రెండు ఎకరాల వివాదాస్పద ల్యాండ్ గురించి వివరంగా తెలియజేశారు. ఇందుకోసం ఆయన ల్యాండ్ కు సంబంధించిన అన్ని రకాలపేపర్లను సీఎం వద్దకు తీసుకెళ్లి చూపించాలని చూస్తున్నారు. ఇక మల్లారెడ్డిని ముఖ్యమంత్రిని కలవనుం డడంతో అడ్లూరి లక్ష్మణ్ కూడా సీఎమ్ఓ అపాయింట్మెంట్ తీసుకోను న్నట్లు తెలుస్తోంది. బాధ్యత గల మంత్రిగా పనిచేసిన మల్లారెడ్డి సుచిత్ర లోని సర్వేనెంబర్ 80లో చేసిన ఘనకార్యాలు ఏంటో.. సీఎం రేవంత్ రెడ్డికి వివరించాలని అడ్లూరు భావిస్తున్నారు. అయితే ఇద్దరి ఎమ్మెల్యేల మధ్య పంచాయతీ పెద్దగా వ్యవహరించబోతున్న ముఖ్యమంత్రి రేవంత్. ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

# కాసులు కురిపిస్తున్న ఫ్యాన్సీ నెంబర్లు

హైదరాబాద్, మే 22: ఓ వాహన ఫ్యాన్సీ నెంబరు ఏకంగా రూ.25.50 లక్షల ధర పలికింది. రవాణా శాఖకు ఓ ఫ్యాన్సీ నెంబరుకు ఇంత రాబడి రావడం రాష్ట్రంలోనే ఇది తొలిసారి. ఖైరతాబాద్ లోని రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం కొత్త సిరీస్ ప్రారంభమైన క్రమంలో ఆన్ లైన్ వేలం నిర్వహించారు. టీజీ09 9999 నెంబరును సోని ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ తమ టయోటా ల్యాండ్ క్రూజర్ ఎల్ఎక్స్ వాహనం కోసం దక్కించుకుంది.

ఆర్టీఏ విధించిన రూ.50 వేల ఫీజుతో పాటు, బిడ్డింగ్ మొత్తం రూ.25.50 లక్షలు చెల్లించి ఈ నెంబరును సొంతం చేసుకుంది. ఆన్ లైన్‌లో ఈ స్థాయిలో పోటీ రావడం తెలంగాణలోనే ఇదో తొలిసారి అని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సి.రమేష్ తెలిపారు. దీంతోపాటు మరికొన్ని ఫ్యాన్సీ నెంబర్ల వేలం ద్వారా ఒక్కరోజే రవాణా శాఖకు రూ.43,70,284 ఆదాయం సమకూరిందని చెప్పారు.

ఆల్ నైన్స్ అత్యధిక బిడ్డింగ్ ఇలా..

- 09 ఉఆ 9999 నెంబరుకు ముప్పా హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.15,53,000 చెల్లించింది.
- 09 ఉఇ 9999 నెంబరుకు కీస్టోన్స్ ఇన్ ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ రూ.17.35 లక్షలు చెల్లించింది.
- 09 ఉఅ 9999 ఫ్యాన్సీ నెంబరుకు ప్రైమ్ సోర్స్ గ్లోబల్ సర్వీస్ చెల్లించిన మొత్తం రూ.21.60 లక్షలు
- 09 9999 నెంబరుకు సోనీ ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ రూ.25.50 లక్షలు చెల్లించి సొంతం చేసుకుంది.

# మెట్రో నష్టాలు నిజం కాదా....!?

హైదరాబాద్: ఆ మధ్య హైదరాబాద్ మెట్రో ఎండీ విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడాడు గుర్తుంది కదా.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం.. మెట్రోను బాగా దెబ్బతీస్తోంది. వచ్చే ప్యాసింజర్లు బాగా తగ్గిపోయారు. ఇలాగైతే మెట్రోను మూసుకోవడమే.. అని అన్నాడు... హైదరాబాద్ ఆదాయం పడిపోతుంది. అదే మా కేసీఆర్ ఉండి ఉంటే ఇట్లుండేదా.. అసలు ప్రజలు మాకు తప్ప కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశారు.. రేవంత్ రెడ్డి ని ఎందుకు ముఖ్యమంత్రిని చేశారు.. అన్నట్టుగా రాసుకు వచ్చింది.. నిజంగానే మెట్రో నష్టాల్లో ఉందా.. మెట్రో ఎండీ వ్యాఖ్యలు చేయడం.. దానికి తగ్గట్టుగా నమస్తే తెలంగాణ మసాలా పూయడం.. భారత రాష్ట్ర సమితి నాయకులు తమదైన శైలిలో విమర్శలు చేయడం.. ఇవన్నీ చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని చులకన చేయాలని చూస్తున్నట్టే కనిపిస్తోంది. వాస్తవంగా లోతుగా తవ్వితే మెట్రో చెప్పినట్టుగా ఆ స్థాయిలో నష్టాలు లేవు. కానీ మెట్రో ఎండీ మాత్రం కేసీఆర్ కు ట్యూన్ అయినట్టు వ్యాఖ్యలు చేస్తున్నారు.హైదరాబాద్ మెట్రోలో ప్రతిరోజు 4.5 లక్షల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్తున్నారు. ప్రయాణికుల ద్వారా ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థకు టికెట్ల విక్రయంతో కోటిన్నర దాకా ఆదాయం వస్తోంది. ఈ ప్రకారం సగటున ఒక్కో ప్రయాణికుడు 35 రూపాయలు చెల్లించి మెట్రోలో ప్రయాణిస్తున్నాడు. ఈ ప్రకారం సగటు ప్రయాణం దూరం 12.5 కిలోమీటర్ల కంటే తక్కువగానే ఉంది. కేవలం ప్రయాణికుల నుంచి చార్జీలు మాత్రమే కాకుండా వాణిజ్య ప్రకటనలు, స్టేషన్లు, మాల్స్ లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయం వస్తోంది. ఈ లెక్కలన్నీ కూడా ఎల్ అండ్ టీ గత ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ప్రకటించినవే.ఇక ఆపరేషన్లు, ఇతర మార్గాల ద్వారా 703.20 కోట్ల ఆదాయం మెట్రోకు సమకూరింది. మెట్రో నిర్వహణ వ్యయం 429 కోట్లు పోతే.. మిగతాది మొత్తం లాభమే.. మరి మెట్రో ఎండీ చెబుతున్నట్టు నష్టాలు ఎక్కడి నుంచి వచ్చాయి.. అయితే మెట్రో రైలు, మాల్స్ నిర్మాణానికి 12,500 కోట్లకు పైగా నిధులను ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ కొంత ఈక్విటీ, మిగతావి బ్యాంకుల కన్సార్షియం నుంచి అప్పు తీసుకొచ్చింది.. 2023 మార్చి 31 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ప్రతి ఏడాది తీసుకొచ్చిన రుణాలపై వడ్డీనే 1,273 కోట్లను చెల్లిస్తున్నట్టు ఎల్ అండ్ టీ తన వార్షిక ఆర్థిక నివేదికలో ప్రకటించింది. ఈ వడ్డీ బారాన్ని ఎల్ అండ్ టీ ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో తగ్గించుకుంది. షాపింగ్ మాల్స్, భూముల సబ్ లీజ్.. వంటి వాటిపై గత ఆర్థిక సంవత్సరం 900 కోట్ల వడ్డీ లేని రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఇక రాయదుర్గంలోని 15 ఎకరాల భూమిని ఒక 1,045 కోట్లకు మానిటైజ్ చేసింది. ఇందులో 512 కోట్లు గత ఏడాది ఎల్ అండ్ టీ సంస్థకు చేరాయి. ఎర్రమంజిల్, పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాలలోని షాపింగ్ మాల్స్ ను ఎల్అండ్ టీ మరో సంస్థకు సబ్ లైసెన్స్ కు ఇచ్చింది. వీటి ద్వారా 3,000 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. వీటి ద్వారా 5000 కోట్ల రుణ భారాన్ని దించుకునేందుకు ఎల్ అండ్ టీ సర్దుబాటు చేసింది. దీనివల్ల వడ్డీ భారాన్ని తగ్గించుకుంది.ఎల్ అండ్ టీ మెట్రో ఆదాయం పెరగాలంటే.. ప్రయాణికుల సంఖ్య పెరగాలి.. రద్దీని తట్టుకునేందుకు అదనపు మెట్రో రైళ్లు కావాలి.. కోచ్ ల సంఖ్యను ఆరుకు పెంచుకోవాలి. ప్రయాణికులను చేరవేసే వేళలను పెంచాలి. ప్రస్తుతం సోమ, శుక్రవారం మాత్రమే ప్రయాణికుల వేళలను ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నారు.. హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీ కాబట్టి.. ప్రతిరోజు పెంచిన వేళల ప్రకారం నడిపితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. సాధ్యమైనంతవరకు అర్ధరాత్రి ఒంటిగంట వరకు రైళ్లు నడిపితే ఆదాయం పెరుగుతుందని రైల్వే రంగ విశ్రాంత నిపుణులు పేర్కొంటున్నారు.

# వారణాసిలో వార్ వన్ సైడే

**బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్.. వారణాసిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బండి**

**కాశీలోని తెలుగు ప్రజలు నివసించే ప్రాంతాల్లో సంజయ్ ప్రచారం**

**పోలింగ్ శాతం పెంచి మోడీకి అత్యధిక మెజారిటీ ఇవ్వాలని బండి అభ్యర్థన**



హైదరాబాద్: జూన్ 1న, జరిగే 7వ దశ ఎన్నికల్లో వారణాసిలో వార్ వన్ సైడే ఉందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. పోల్ అయ్యే ఓట్లలో అత్యధిక శాతం శాతం మోడీకే పడటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నియోజకవర్గమైన వారణాసిలో తెలుగువారు అత్యధికంగా నివసించే పాండే హవేలీ, సోనార్ పుర తదితర ప్రాంతాల్లో బండి సంజయ్ డోర్ టు డోర్ ప్రచారం చేశారు. పలు తెలుగు సంఘాల ప్రతినిధులతో సంజయ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ వారణాసి లో ఉన్న ప్రతి ఒక్కరూ మోడీ అభిమానులేనని, వారంతా కచ్చితంగా కమలం గుర్తుకే ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అయితే పోలింగ్ శాతం పెరిగేలా చూడాల్సిన అవసరం ఉందని తెలుగు సంఘాల ప్రతినిధులను కోరారు. మోడీకి భారతదేశంలోనే అత్యధిక మెజారిటీ రావాలంటే అత్యధిక పోలింగ్ నమోదు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సోనార్ పుర లో మహిళా బృందంతో బండి సంజయ్ భేటీ సందర్భంగా కాశీలోని ప్రతి ఒక్క మహిళ మోడీకే ఓటు వేస్తారని బృందంలోని మహిళలు సంజయ్ కు వివరించారు. అదే ధీమాతో కూర్చోకుండా ఇంట్లో వాళ్ళతో పాటు ఇరుగుపొరుగు వారితోను ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మహిళలదే అని సంజయ్ వారికి సూచించారు. శ్రీ రామ తారక ఆంధ్రా అశ్రమం లో వారణాసి తెలుగు సమితి కార్యదర్శి వి వి. సుందర శాస్త్రి తో భేటీ అయిన బండి సంజయ్ తెలుగు వారి పోలింగ్ నూటికి నూరు శాతం జరిగేలా చూడాలని కోరారు. సుబ్రహ్మణ్య జోషి, మహేష్ బాబు తదితర తెలుగు ప్రముఖులతో సంజయ్ కలిసి మోడీని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పలు మఠాలు, సత్రాల్లో తెలుగు సంఘాలతో జరిగిన సమావేశాల్లో స్థానిక కార్పొరేటర్ ముఖర్జీ, బీజేపీ నాయకులు గజానంద్ జోషి, మహేష్ బాబు, పాఠక్ తో పాటు హైదరాబాదు నుంచి వెళ్లిన బిజెపి నాయకులు గీతా మూర్తి, బొమ్మ జయశ్రీ, ఉమారాణి, సంగప్ప, విక్రమ్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్ పరిణిత తదితరులు పాల్గొన్నారు.

# పదినిమిషాల్లో రెండు సెల్ఫోన్ స్నాచింగ్లు

హైదరాబాద్: బ్లాక్ డ్రెస్, ముఖాలకు మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు 10 నిమి షాల వ్యవధిలోనే రెండు చోట్ల సెల్ఫోన్లు లాక్కొని పారిపో యారు. ఎస్ఆర్నగర్ పోలీసుల కథనం ప్రకారం.. బెంగళూరుకు చెందిన హోటల్ ఉద్యోగి పి. రాజు ఉదయం 5 గంటలకు బల్కంపేట రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు అతడి చేతిలో ఉన్న సెల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. మరో ఘటనలో.. అమీర్పేట వెల్ నెస్ దవాఖాన వద్ద ప్రైవేటు ఉద్యోగి సురేశ్ నడుచుకుంటూ వెళ్తుండగా.. బైక్పై వచ్చిన ఇద్దరు దుండగులు అతడి చేతిలో ఉన్న సెల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. దీంతో బాధితులు ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు

# ఇంటి నేమ్‌ప్లేట్ మార్చేసిన సానియా మీర్జా.. ఎవరి పేరు యాడ్ చేసిందంటే..?



భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఇటీవలే భర్త నుంచి విడిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కుమారుడితో కలిసి ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తన పాత జ్ఞాపకాలను ఒక్కొక్కటిగా చెరుపేసుకుంటూ లైఫ్‌ను కొత్తగా మొదలెట్టింది. ఇందులో భాగంగానే తాజాగా తన ఇంటి నేమ్ ప్లేట్‌ను కూడా మార్చేసింది. తన పేరు పక్కన కుమారుడు ఇజాన్ పేరు ఉండేలా 'సానియా ఇజాన్' అంటూ నేమ్ ప్లేట్‌ను తయారు చేయించుకుని ఇంటి ముందు తగిలించేసింది. ఇందుకు సంబంధించిన ఫొటోను సానియా తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేసింది.

ప్రస్తుతం ఆ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది.

కాగా, దాయాదిదేశమైన పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను సానియా మీర్జా ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరి వివాహం 2010లో హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. 2018లో ఈ దంపతులకు ఓ కుమారుడు (ఇజాన్) జన్మించాడు. అయితే, ఇటీవలే వీరు తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. ఆ తర్వాత షోయబ్ ముచ్చటగా మూడో పెళ్లి కూడా చేసుకున్నాడు. పాకిస్థాన్ ప్రముఖ సినీతారగా గుర్తింపు పొందిన సనా జావెద్‌ను ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకొని అందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇక సానియా మాత్రం కుమారుడితో ఒంటరిగానే ఉంటోంది.

# త్రెసా, గాయత్రి ముందంజ



త్రెసా, గాయత్రి ముందంజకౌలాలంపూర్ : కామన్‌వెల్త్ క్రీడల మెడలిస్ట్ యువ జోడీ గాయత్రి పుల్లెల, త్రెసా జాలి జోడీ మలేషియా ఓపెన్‌లో శుభారంభం చేసింది. మహిళల డబుల్స్ విభాగంలో భారత అమ్మాయిలు తొలి రౌండ్లో విజయం సాధించారు. ఏడో సీడ్ గాయత్రి, త్రెసాలు 21-14, 21-10తో వరుస గేముల్లో చైనీస్ తైపీ షట్లర్లు హుయాంగ్, లియాంగ్‌లను చిత్తు చేశారు. పురుషుల సింగిల్స్ అర్హత రౌండ్‌లో భారత షట్లర్లు నిరాశపరిచారు. సతీశ్ కుమార్ కరుణాకరన్, ఆయుశ్ శెట్టి, శంకర్ సుబ్రమణియం, కార్తికేయ గుల్షన్ కుమార్‌లు ప్రధాన టోర్నీకి చేరుకోలేకపోయారు. మహిళల సింగిల్స్ అర్హత రౌండ్‌లో తాన్య హేమంత్, మహిళల డబుల్స్‌లో పాలక్ అరోర, ఉన్నతీ హుడాలు సైతం నిరాశపరిచారు. సింధు టైటిల్ వేట : పారిస్ ఒలింపిక్స్ ముంగిట అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు ఓ టైటిల్ విజయం కోసం ఎదురుచూస్తుంది. ఈ సీజన్లో సింధు పెద్దగా రాణించలేదు. గాయం నుంచి కోలుకుని మెరుగ్గా ఆడుతున్నా.. కీలక మ్యాచుల్లో తడబాటుకు గురవుతోంది. మహిళల సింగిల్స్‌లో నేడు తొలి రౌండ్లో స్కాట్లాండ్ షట్లర్ క్రిస్టీ గిల్మోర్‌తో సింధు తలపడనుంది. అష్మిత చాలిహా, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్‌లు బరిలో నిలిచారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జ్ ఒక్కడే పోటీలో నిలిచాడు.

# నో ట్రయల్స్

## - బెర్త్‌లు కొట్టినోళ్లకే పారిస్ టికెట్
## - భారత రెజ్లింగ్ సమాఖ్య కీలక నిర్ణయం



న్యూఢిల్లీ : 2024 పారిస్ ఒలింపిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌పై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కీలక నిర్ణయం తీసుకుంది. మంగళవారం సమావేశమైన డబ్ల్యూఎఫ్ఐ సెలక్షన్ కమిటీ.. ఎటువంటి సెలక్షన్ ట్రయల్స్ లేకుండానే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారు చేసింది. ఒలింపిక్స్ కోటా బెర్త్ సాధించిన రెజ్లర్లకే ఈ సారి పోటీల్లో తలపడే అవకాశం కల్పిస్తున్నాం. గతంలో మాదిరి ఒలింపిక్స్‌లో పోటీపడే రెజ్లర్లను ఎంపిక చేసేందుకు ఎటువంటి సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించటం లేదు. ఈ మేరకు ఏడుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ మంగళవారం ప్రకటించింది. ' వినేశ్ ఫోగట్ మినహా ఐదుగురు రెజ్లర్లు ట్రయల్స్ నిర్వహించకుండా నేరుగా పారిస్‌కు పంపించాలని డబ్ల్యూఎఫ్ఐకి లేఖ రాశారు. ఈసారి ఒలింపిక్స్‌లో పోటీపడే రెజ్లర్లను ఎంపిక చేసేందుకు ట్రయల్స్ అవసరం లేదని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది' అని డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ తెలిపారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి ఆరుగురు రెజ్లర్లు పోటీపడనున్నారు. ఇందులో ఐదుగురు మహిళా రెజ్లర్లు కాగా.. మెన్స్ విభాగంలో ఓ రెజ్లర్ అర్హత సాధించాడు.

భారత రెజ్లింగ్ సమాఖ్య తాజా నిర్ణయంతో ఒలింపిక్ మెడలిస్ట్ రవి దహియ ఆశలు ఆవిరయ్యాయి. మెన్స్ 57 కేజీల విభాగంలో భారత్‌కు ఓ కోటా బెర్త్ ఉంది. ఈ విభాగంలో రవి దహియ పోటీపడేందుకు ఆసక్తి చూపించాడు. కానీ ట్రయల్స్ లేకపోవటంతో ఒలింపిక్ కోటా బెర్త్ సాధించిన రెజ్లర్ షెరావత్ పారిస్‌కు వెళ్లనున్నాడు. వినేశ్ ఫోగట్ 50 కేజీల విభాగంలో కోటా బెర్త్ సాధించింది. కానీ 53 కేజీల విభాగంలో అంతిమ్‌తో పోటీపడేందుకు వినేశ్ ఫోగట్ ట్రయల్స్ కోసం ఎదురుచూసింది. పారిస్ ఒలింపిక్స్ ఎంతో సమయం లేదని, ఇప్పుడు ట్రయల్స్ నిర్వహణతో రెజ్లర్లకు ఏమైనా గాయాలు తగిలితే పతక అవకాశాలకు గండి పడుతుందని సెలక్షన్ కమిటీ భావించింది. అయితే, ఈ మినహాయింపు 2024 ఒలింపిక్స్‌కు మాత్రమే వర్తిస్తుందని డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది. డబ్ల్యూఎఫ్ఐ నిబంధనల ప్రకారం టాప్-3 రెజ్లర్లు పోటీపడగా అందులో విజేత.. కోటా బెర్త్ సాధించిన రెజ్లర్‌తో ఫైనల్లో తలపడాల్సి ఉంటుంది. ఫైనల్లో గెలుపొందిన రెజ్లర్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున పోటీపడే అవకాశం దక్కించుకుంటారు.

ఒలింపిక్స్‌కు అర్హత

సాధించిన రెజ్లర్లు : వినేశ్ ఫోగట్ (50 కేజీలు), అంతిమ్ పంగాల్ (53 కేజీలు), అన్షు మాలిక్ (57 కేజీలు), నిశా దహియ (68 కేజీలు), రితిక హుడా (76 కేజీలు). షెరావత్ (57 కేజీలు).

# బంగ్లాకు ఇచ్చి పడేసిన 19వ నంబర్ జట్టు.. భారత్, కివీస్ ఆటగాళ్ల దెబ్బకు ఘోర పరాజయం..



మే 21న బంగ్లాదేశ్‌ను అమెరికా ఐదు వికెట్ల తేడాతో ఓడించి, %u%20 ప్రపంచకప్ 2024కి ముందు ఇతర జట్లకు హెచ్చరిక ఇచ్చింది. టెక్సాస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ ఆరు వికెట్లకు 153 పరుగులు చేసింది.

మూడు బంతులు మిగిలి ఉండగానే అమెరికా ఈ లక్ష్యాన్ని సాధించింది. దాని విజయానికి హీరో భారతదేశానికి చెందిన హర్మీత్ సింగ్ 13 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 33 పరుగులతో తుఫాన్ ఇన్నింగ్స్ ఆడి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. బంగ్లాదేశ్‌పై అమెరికా తొలిసారి విజయం సాధించింది. ఈ జట్టు పూర్తి జాతీయ జట్టును రెండోసారి ఓడించింది. కొంతకాలం క్రితం ఐర్లాండ్‌ను ఓడించింది. ఐసీసీ టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ తొమ్మిదో స్థానంలో ఉండగా, అమెరికా 19వ స్థానంలో ఉంది. ఈ సిరీస్‌కు ముందు ఈ రెండు జట్లు ఎప్పుడూ తలపడలేదు.

లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అమెరికా ధీటుగా ఆరంభించింది. స్టీవెన్ టేలర్ (28), కెప్టెన్ మోనాంక్ పటేల్ (12) 27 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పటేల్ రనౌట్ కారణంగా బంగ్లాదేశ్ తొలి వికెట్‌ను దక్కించుకుంది. ఆండ్రీస్ గోస్ వచ్చి పరుగులను వేగవంతం చేశాడు. 18 బంతుల్లో నాలుగు ఫోర్లతో 23 పరుగులు చేశాడు. కానీ, 13 పరుగుల వ్యవధిలో అతను, టేలర్, ఆరోన్ జేమ్స్ (4) ఔట్ కావడంతో అమెరికా ఇబ్బందుల్లో కూరుకపోయింది. నితీష్ కుమార్ కచ్చితంగా సిక్సర్ కొట్టినా 10 పరుగులు మాత్రమే చేయగలిగాడు. దీంతో జట్టు స్కోరు 14.5 ఓవర్లలో ఐదు వికెట్లకు 94 పరుగులు చేసింది.

### దుమ్ము రేపినా హర్మీత్-అండర్సన్..

ఇప్పుడు న్యూజిలాండ్ నుంచి వచ్చిన అండర్సన్, భారత్ నుంచి వచ్చిన హర్మీత్ క్రీజులో ఉన్నారు. ఆరంభంలో అండర్సన్ పెద్దగా పరుగులు చేయలేకపోయాడు. ఒకానొక సమయంలో అతను 19 బంతుల్లో 17 పరుగులు చేసి ఆడుతున్నాడు. కానీ, హర్మీత్ రాగానే ఒత్తిడి తగ్గించుకుని పరుగులు రాబట్టాడు. అతను 17వ ఓవర్‌లో ముస్తాఫిజుర్ రెహమాన్‌పై వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. తర్వాతి ఓవర్‌లో షోరీఫుల్ ఇస్లామ్‌కి ఒక సిక్స్, ఫోర్ బాదాడు. చివరి రెండు ఓవర్లలో 24 పరుగులు చేయాల్సి ఉంది. అండర్సన్ కూడా దూకుడు మొదలుపెట్టాడు. అతను 19వ ఓవర్లో ముస్తాఫిజుర్‌పై సిక్సర్ బాది మొత్తం 15 పరుగులు పిండుకున్నాడు. ఇప్పుడు చివరి ఓవర్‌లో తొమ్మిది పరుగులు కావాల్సి ఉంది. మహ్మదుల్లా వేసిన ఓవర్ తొలి బంతికి అండర్సన్ సిక్సర్ కొట్టగా, హర్మీత్ ఫోర్ తో మ్యాచ్ ముగించాడు. హర్మీత్, కోరీ అండర్సన్ రాణించడంతో అమెరికా చివరి 27 బంతుల్లో 55 పరుగులు చేసి విజయం సాధించింది.

### బంగ్లాదేశ్ బ్యాటింగ్‌ను కట్టడి చేసిన అమెరికా..

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు కూడా ఇబ్బందులు పడింది. లిటన్ దాస్ (14), సౌమ్య సర్కార్ (20), కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో (3), షకీబ్ అల్ హసన్ (6) త్వరగా ఔటయ్యారు. దీంతో ఆ జట్టు 12వ ఓవర్ వరకు నాలుగు వికెట్ల నష్టానికి 68 పరుగుల వద్ద కష్టాల్లో పడింది. కానీ, తౌహిద్ హృదయ్ (58), మహ్మదుల్లా (31) కలిసి ఐదో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇది జట్టును గౌరవప్రదమైన స్కోరుకు తీసుకెళ్లింది. తౌహిద్ ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉండగా, వెటరన్ బ్యాట్స్‌మెన్ రెండు ఫోర్లు, ఒక సిక్స్ బాదాడు. స్టీవెన్ టేలర్ అమెరికా నుంచి అత్యంత విజయవంతమైన బౌలర్. మూడు ఓవర్లలో తొమ్మిది పరుగులు మాత్రమే ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. సౌరభ్ నేత్రవాల్కర్, హర్మీత్ సింగ్ ఆర్థికంగా బౌలింగ్ చేశారు.

# ఫైనల్లో కేకేఆర్.. క్వాలిఫయర్-1లో చేతులెత్తేసిన సన్‌రైజర్స్

## మిచెల్ స్టార్క్ పేస్‌కు విలవిల
## ఎస్ఆర్‌హెచ్‌ను ఆదుకున్న త్రిపాఠి
## లక్ష్యాన్ని ఊదేసిన వెంకటేశ్, శ్రేయస్





ఐపీఎల్ -17 ఆరంభం నుంచి నిలకడగా రాణిస్తోన్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మూడేండ్ల తర్వాత మళ్లీ ఈ లీగ్ ఫైనల్స్‌లో అడుగుపెట్టింది.

మంగళవారం అహ్మదాబాద్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)ను చిత్తుగా ఓడించిన కేకేఆర్..లీగ్‌లో నాలుగోసారి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. సీజన్‌లో అంతగా ప్రభావం చూపని రూ.24.75 కోట్ల స్టార్క్.. కీలక సమయంలో జూలు విదిల్చి తన అమ్ములపొదిలో ఉన్న అస్త్రాలను సంధించడంతో హైదరాబాద్ కథ ఆదిలోనే ముగిసింది. త్రిపాఠి, క్లాసెన్ ఆదుకున్నా కేకేఆర్ బౌలర్లు సమిష్టిగా రాణించిన పిచ్‌పై మన బౌలింగ్ దళం దారుణంగా తేలిపోయింది. ఒత్తిడిలో చిత్తైన సన్‌రైజర్స్.. రెండో క్వాలిఫయర్‌లో నేడు జరిగే 'ఎలిమినేటర్ మ్యాచ్ విజేత'తో పోటీ పడుతుంది.

అహ్మదాబాద్: ఐపీఎల్-17లో సమిష్టి ప్రదర్శనతో ప్రత్యర్థి జట్లకు ముచ్చెమటలు పట్టిస్తున్న కోల్‌కతా నైట్ రైడర్స్.. క్వాలిఫయర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై అఖండ విజయంతో ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. మంగళవారం నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్‌పై 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదుచేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మిచెల్ స్టార్క్ (3/34), వరుణ్ చక్రవర్తి (2/26)తో పాటు కేకేఆర్ బౌలర్లు సమిష్టిగా రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. 19.3 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. రాహుల్ త్రిపాఠి (35 బంతుల్లో 55, 7 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. భారీ హిట్టర్లు ఉన్న కోల్‌కతా ఈ లక్ష్యాన్ని 13.4 ఓవర్లలోనే 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. 'అయ్యర్' ద్వయం వెంకటేశ్ (28 బంతుల్లో 51 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), శ్రేయస్ (24 బంతుల్లో 58 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) లక్ష్యాన్ని ఊదిపారేశారు.

### త్రిపాఠి ఒక్కడే..

ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ తమ ఓపెనర్ల మీద ఎంతలా ఆధారపడిందో కోల్‌కతాతో మ్యాచ్ ద్వారా మరోసారి నిరూపితమైంది. కేకేఆర్ స్టార్ పేసర్ స్టార్క్, వైభవ్ అరోరా ఆరంభంలోనే హైదరాబాద్‌ను దెబ్బకొట్టి కోలుకోనీయకుండా చేశారు. పంజాబ్‌తో గత మ్యాచ్‌లో మాదిరిగానే స్టార్క్ తొలి ఓవర్లో రెండో బంతికే ట్రావిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. రెండో ఓవర్లో అరోరా బౌలింగ్‌లో.. అభిషేక్ శర్మ (3) క్యాచ్‌ను రస్సెల్ పట్టడంతో నిష్క్రమించాడు. స్టార్క్ ఐదో ఓవర్లో వరుస బంతుల్లో నితీశ్ రెడ్డి (9), షాబాజ్‌ను ఔట్ చేసి మరోసారి దెబ్బకొట్టాడు. ఈ క్రమంలో రాహుల్ త్రిపాఠితో జతకలిసిన క్లాసెన్ (21 బంతుల్లో 32, 3 ఫోర్లు, 1 సిక్స్) .. సన్‌రైజర్స్‌ను ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ ధాటిగా ఆడటంతో ఎస్ఆర్‌హెచ్ స్కోరుబోర్డు వేగం పుంజుకుంది. వికెట్‌ను కాపాడుకుంటూనే వీలుచిక్కినప్పుడల్లా బంతిని స్టాండ్స్‌లోకి పంపిన త్రిపాఠి.. 29 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కానీ బౌలింగ్ మార్పుగా వచ్చిన వరుణ్ చక్రవర్తి.. 11వ ఓవర్లో క్లాసెన్‌ను ఔట్ చేయడంతో ఎస్ఆర్‌హెచ్ పరిస్థితి మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా అయింది. నరైన్ 14వ ఓవర్లో అబ్దుల్ సమద్ (16)తో సమన్వయ లోపం కారణంగా త్రిపాఠి రనౌట్ అవడంతో పాటు సన్వీర్ సింగ్ డకౌట్ అయ్యాడు. ఆఖర్లో సారథి పాట్ కమిన్స్ (24 బంతుల్లో 30, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులతో హైదరాబాద్ గౌరవప్రదమైన స్కోరుచేసింది.

### కేకేఆర్ అలవోకగా..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కోల్‌కతా.. ఆది నుంచే హిట్టింగ్‌కు దిగింది. పవర్ ప్లేలో రెహ్మనుల్లా గుర్బాజ్ (14 బంతుల్లో 23, 2 ఫోర్లు, 2 సిక్సర్లు), సునీల్ నరైన్ (16 బంతుల్లో 21, 4 ఫోర్లు) మెరుపు ఆరంభాన్నిచ్చారు. ఈ ఇద్దరూ నిష్క్రమించినా వారి స్థానాల్లో వచ్చిన వెంకటేశ్ అయ్యర్, సారథి శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడారు. ఎదుర్కున్న తొలి బంతికే బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన వెంకటేశ్.. భువీ, కమిన్స్ బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడాడు. ఈ ఇద్దరూ బాదుతున్నా కమిన్స్ బౌలర్లను మార్చకపోవడంతో ఈ జోడీ స్వేచ్ఛగా ఆడి అర్ధ శతకాలతో పాటు మ్యాచ్‌నూ ముగించింది. పది ఓవర్లలోనే వంద పరుగుల మార్కును దాటిన కోల్‌కతా.. మరో 6.2 ఓవర్లు మిగిలుండగానే గెలిచి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఐపీఎల్ ఫైనల్స్‌లో ఆడటం కేకేఆర్‌కు ఇది నాలుగో సారి కావడం విశేషం.

### సంక్షిప్త స్కోర్లు

హైదరాబాద్: 19.3 ఓవర్లలో 159 ఆలౌట్ (త్రిపాఠి 55, క్లాసెన్ 32, స్టార్క్ 3/34, చక్రవర్తి 2/26).

కోల్‌కతా: 13.4 ఓవర్లలో 164/2 (శ్రేయస్ 58 నాటౌట్, వెంకటేశ్ 51 నాటౌట్, నటరాజన్ 1/22, కమిన్స్ 1/38).

# ఆ రెజ్లర్లకు ఊరట..



ఢిల్లీ: ఇటీవలే ముగిసిన బిష్కెక్, ఇస్తాంబుల్ అర్హత టోర్నీలలో సత్తా చాటి పారిస్ ఒలింపిక్స్ బెర్తులు ఖాయం చేసుకున్న ఆరుగురు రెజ్లర్లకు భారీ ఊరట దక్కింది.

ఈ రెజ్లర్ల కేటగిరీలలో మళ్లీ ట్రయల్స్ నిర్వహించబోమని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఏడుగురు సభ్యులతో కూడిన సెలక్షన్ కమిటీ.. ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ తెలిపాడు. ట్రయల్స్ వల్ల రెజ్లర్లు ఒకవేళ గాయాల బారిన పడితే అది మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉండటంతో ఆ ప్రయత్నాలను డబ్ల్యూఎఫ్ఐ విరమించుకుంది. అయితే ఈ నిర్ణయం పట్ల ఓ సీనియర్ రెజ్లర్ కోర్టుకు వెళ్లే అవకాశమున్నట్టు సమచారం. పారిస్ టికెట్ ఖాయం చేసుకున్న రెజ్లర్లలో వినేశ్ ఫోగట్ (50 కిలోలు), అంతిమ్ పంఘల్ (53 కిలోలు), అన్షు మాలిక్ (57 కిలోలు), నిషా దహియా (68 కిలోలు), రితికా హుడా (76 కిలోలు), అమన్ సెహ్రావత్ (57 కిలోలు) ఉన్నారు. ఒలింపిక్స్ ముందు మళ్లీ ట్రయల్స్ నిర్వహణ వద్దని వీరంతా డబ్ల్యూఎఫ్ఐకి ఇటీవలే లేఖ రాసిన విషయం విదితమే.

# ఆ కుర్రాళ్లు ఏంట్రా.. మరి ఇంత టాలెంటెడ్‌గా ఉన్నారు!- స్టార్క్



కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. అహ్మదాబాద్ వేదికగా మంగళవారం జరిగిన క్వాలిఫయిర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో నెగ్గింది. ఈ విజయంతో కేకేఆర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ తుది పోరుకు చేరడం కోల్‌కతాకు ఇది నాలుగోసారి. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఆర్‌హెచ్ మిచెల్ స్టార్క్ (3/34) మూడు, వరుణ్ చక్రవర్తి (2/26) ధాటికి 19.3 ఓవర్లలో 159 పరుగులకు కుప్పకూలింది. రాహుల్ త్రిపాఠి (55బీ 35 బంతుల్లో, 7%ఇ4, 1ఇ%6) టాప్ స్కోరర్.ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్ (32బీ 21 బంతుల్లో, 3%ఇ4, 1ఇ%6), ప్యాట్ కమిన్స్ (30బీ 24 బంతుల్లో, 2%ఇ4, 2ఇ%6), అబ్దుల్ సమద్ (16బీ 12 బంతుల్లో, 2%ఇ%6) మినహా మిగిలనెవరూ రెండంకెల స్కోరును అందుకోలేకపోయారు. అనంతరం ఛేదనకు దిగిన కేకేఆర్ 13.4 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. శ్రేయస్ అయ్యర్ (58లిబీ 24 బంతుల్లో, 5%ఇ4, 4ఇ%6), వెంకటేశ్ అయ్యర్ (51లిబీ 28 బంతుల్లో, 5%ఇ4, 4ఇ%6) అజేయ అర్ధశతకాలు సాధించారు. కమిన్స్ (1/38), నటరాజన్ (1/22) చెరో వికెట్ సాధించారు. కాగా, విజయంలో కీలక పాత్ర పోషించిన స్టార్క్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. తొలి ఓవర్లో విధ్వంసక ఓపెనర్ హెడ్‌ను ఔట్ చేసిన స్టార్క్ అయిదో ఓవర్లో నితీష్ కుమార్ రెడ్డి, షాబాజ్ అహ్మద్‌లను వరుస బంతుల్లో ఔట్ చేసి సన్‌రైజర్స్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. కాగా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న అనంతరం స్టార్క్ మాట్లాడాడు. "పవర్‌ప్లే చాలా ముఖ్యమని తెలుసు. ఇరు జట్లు పవర్‌ప్లేలో బ్యాటుతో ఆధిపత్యం చెలాయించే జట్లే. అందుకే ఆదిలోనే వికెట్లు తీసి, మిడిలార్డర్‌పై ఒత్తిడి తీసుకురావాలని భావించాం. ఈ సీజన్‌లో ట్రావిస్ హెడ్-అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. బంతిని స్వింగ్ చేస్తూ వాళ్లను కట్టడి చేయాలని ప్లాన్ చేశాం. స్టంప్స్‌కు గురిపెడుతూ హార్డ్ లెంగ్త్ బంతులు విసరాలని భావించాం" "ట్రావిస్ హెడ్‌ను ఆదిలోనే పెవిలియన్‌కు చేర్చడం సంతోషంగా ఉంది. హెడ్ వికెట్ సాధించడంలో కాస్త అదృష్టం కూడా ఉంది. ఇక మా యువ బౌలర్లు వైభవ్ అరోరా, హర్షిత్ రాణా ఎంతో టాలెంటెడ్ కుర్రాళ్లు. వాళ్లెంతో శ్రమించారు. వాళ్ల ప్రదర్శన చూడటం సంతోషంగా ఉంది. ఈ సీజన్‌లో హర్షిత్ గొప్పగా రాణిస్తున్నాడు. ఈ కుర్రాళ్లు ఐపీఎల్‌లోనే కాదు, భారత్ తరఫున ఎన్నో వికెట్లు సాధిస్తారు" అని స్టార్క్ అన్నాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers**, (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**